1

నవతెలంగాణ

నిజామాబాద్-కామారెడ్డి

శుక్రవారం | మార్చి 08, 2024 | www.navatelangana.com

ఎల్ఆర్ఎస్ ఫీజులు వసూలు చేయొద్దు

- కలెక్టర్‌కు వినతినిచ్చిన మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

నవతెలంగాణ-కామారెడ్డి

ఎల్ఆర్ఎస్ ఫీజులు వసూలు చేయొద్దని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. ఈ విషయమై బీఆర్ఎస్ నాయకులు ఎల్ఆర్ఎస్ ఫీజుల వసూలుకు వ్యతిరేకంగా కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నుంచి ఎల్ఆర్ఎస్ ఫీజు వసూలు చెయ్యడానికి బీఆర్ఎస్ పార్టీ నుంచి వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు యంకె ముజీబోద్దీన్, నాయకులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

ముస్తాబైన శివాలయాలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మహాశివరాత్రి పండుగ సందర్భంగా నగరంలోని నీలకంఠేశ్వర ఆలయంలో భక్తుల కోసం దర్శనార్థం ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక లైన్లను ఏర్పాటు చేశారు. అలాగే ఎండ నుంచి ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు టెంట్లను ఏర్పాటు చేశారు. దేవాలయ దర్శనం కోసం వచ్చే ప్రజలకు మంచినీళ్లు ఏర్పాటు చేశారు. నగరంలోని హైమదీబజార్‌లో గల శంభుని ఆలయం, అదేవిధంగా నగరంలోని పలు కాలనీల్లోని శివాలయాలు ప్రజల దర్శనార్థం ముస్తాబు చేశారు.



శివరాత్రికి ముస్తాబైన నీలకంఠేశ్వర్ ఆలయం

గ్రామాల్లో నీటి కటకట

- పంటపొలాల నుంచి నీరు తెచ్చుకుంటున్న మహిళలు
- కొన్నిచోట్ల ట్యాంకర్ ద్వారా మంచి నీటి సరఫరా

నవతెలంగాణ-విలేకరుల బృందం

కామారెడ్డి జిల్లాలోని పలు గ్రామాల్లో నీటి కటకట ప్రారంభమైంది. వేసవి కాలం ఆరంభంలోనే నీటి ఇబ్బందులుంటే.. మే నెలలో ఏ విధంగా ఉంటుందో స్పష్టమవుతోంది.

రామారెడ్డి : గ్రామాల్లో తాగునీటి సమస్య ఉండకూడదని ప్రభుత్వం, ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయి అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించినా.. క్షేత్రస్థాయిలో అధికారులు, ప్రజాప్రతినిధులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో నీటి సమస్య నెలకొంటుంది. మండలంలోని మద్దికుంటలో తాగునీటి సమస్య ఏర్పడింది. మద్దికుంట ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని, గ్రామంలో నీటి ఎద్దడి ఉండకుండా గతంలో ట్యాంకర్లతో కూడా నీరు అందించేవారు. ఈ సంవత్సరం మిషన్ భగీరథ నీరు సరిపడా రాకపోవడం, భూగర్భజలాలు అడుగంటిపోవడంతో అధికారులు ముందస్తుగా ట్యాంకర్లతో నీరందించకపోవడంతో గ్రామంలో నీటి ఎద్దడితో మహిళలు కాలినడకన పంట పొలాల నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. గ్రామం నడిబోడ్డున గత సంవత్సరం నుంచి ట్యాప్ ఏర్పాటు చేయకపోవడంతో నీరు వృథాగా పోతుంది. తాగునీటి సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని గ్రామంలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.



రామారెడ్డి : పంటపొలాల నుంచి నీటిని తెచ్చుకుంటున్న మహిళలు

పెద్దకొడప్‌గల్ : మండలంలోని పోచారం తాండ వాసులకు మంచి నీటి కటకట మొదలైంది. దీంతో పంచాయతీ కార్యదర్శి రాములు ప్రభుత్వం అందజేసిన ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా ప్రజలకు నీళ్లు సరఫరా చేయిస్తున్నాని ప్రజలు తెలిపారు. సుమారు 40 రోజుల నుంచి మిషన్ భగీరథ నీళ్లు తమకు తాగడానికి సరఫరా కావడం లేదని తాండ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఎండాకాలం ప్రారంభమవుతున్న సమయంలోనే మంచి నీరు అందక కష్టాలు ఎదుర్కొంటున్నామని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజలకు మంచి నీటిని అందించేందుకు కృషి చేయాలని కోరుతున్నారు.



పెద్దకొడప్‌గల్ : ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న తండావాసులు

పండ్ల ధరలకు రెక్కలు

- శివరాత్రిని పురస్కరించుకుని భారీగా పెరిగిన ధరలు
- రత్నపురి గడ్డ కిలో రూ.50 నుంచి 60
- దానిమ్మ కిలో రూ.200పైనే
- కొనాలంటే జంకుతున్న ప్రజలు

నవతెలంగాణ-కామారెడ్డి/నిజామాబాద్‌సిటీ

పండ్ల ధరలకు రెక్కలొచ్చాయి. మహా శివరాత్రి పండుగను పురస్కరించుకుని ప్రజలు భారీగా ఉపవాస దీక్షల్లో ఉంటారు. ఈ సమయంలో పండ్లను ఆహారంగా తీసుకుంటారు. ఈ నేపథ్యంలో పండ్లను భారీగా కొనుగోలు చేస్తారు. దాంతో పండ్లకు డిమాండ్ నెలకొంది. సాధారణ రోజుల్లో ఉండే ధరల కంటే.. శివరాత్రి పండుగ నేపథ్యంలో పండ్ల ధరలు రూ.20 నుంచి 30వరకు పెరిగాయి. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లా కేంద్రాల్లో గురువారం ఈ విధంగా ధరలు పలికాయి.

కామారెడ్డి జిల్లాలో ద్రాక్షపండ్లు కిలో రూ.80 ఉండగా.. డజన్ అరటి పండ్లు రూ.60-70, సంత్రాలు రూ.80, రత్నపురి గడ్డ 50-60, ఖర్జూరాలు పావుకిలో రూ.60, దానిమ్మ రూ.200 విక్రయిస్తున్నారు. కర్బుజా కిలో రూ.30కి పైగా విక్రయిస్తున్నారు. తెల్ల కర్బుజా కిలో రూ.40-50 చొప్పున వ్యాపారులు విక్రయిస్తున్నారు.





నిజామాబాద్‌సిటీ : మార్కెట్‌లో వివిధ రకాల పండ్లు.. రత్నపురి గడ్డల అమ్మకం..

నిజామాబాద్ ధరలు ఇలా..

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో రత్నపురి గడ్డ కేజీ రూ.40, ద్రాక్ష పండ్లు కిలో రూ.60, కర్బూజా కిలో రూ.20, కజూర్ కిలో రూ.120, మోసంబి కిలో రూ.40, సపోటా కిలో రూ.60, సంత్రా కిలో రూ.40, ఆపిల్స్ కిలో రూ.200, దానిమ్మ కిలో రూ.180, అరటి పండ్లు డజన్ రూ.40-50, తర్బూజా రూ.40 కేజీ ధర పలుకుతోంది. కాగా నేడు, రేపు పండ్ల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

గోగుపువ్వు ప్రత్యేకం..

మహాశివరాత్రి పండుగ సందర్భంగా గోగు పువ్వుకు ఎంతో ప్రత్యేకత ఉంది. పూజ సమయంలో ప్రజలు ఈ పువ్వును ప్రత్యేకంగా శివుడి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేస్తారు. కాగా మార్కెట్‌లో ఈ పువ్వును కుప్ప రూ.20 చొప్పున విక్రయిస్తున్నారు.



మార్కెట్‌లో గోగుపువ్వు..

నకిలీ పట్టా పాస్ పుస్తకాలతో బ్యాంకులో రుణాలు

- బ్యాంకు అధికారులతో వాగ్వివాదానికి దిగిన రైతులు

నవతెలంగాణ-రెంజల్

గత 50 సంవత్సరాలుగా పంటలు పండించు కుంటూ, కబ్జాలోనున్న రైతులను కాదని, నకిలీ పట్టాపాస్ పుస్తకాలను సృష్టించి లక్షల రూపాయలను డ్రా చేసిన ఉద్దాంతం వెలుగులోకి వచ్చింది. బ్యాంకు మేనేజర్ సంతోష్ గురువారం ఆ భూమిని స్వాధీనం చేసుకోవడానికి రాగా రైతులు అడ్డుకున్నారు. 23 మంది రైతుల భూములపై నకిలీ పట్టా పాస్ పుస్తకాలతో రుణాలను కాజేసిన వ్యక్తికి బ్యాంకు అధికారులు పలుమార్లు నోటీసులు అందజేసినా అతను బ్యాంకుకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, దీంతో ఆ భూములను సర్వే చేయించడానికి సర్వేయర్‌తో రాగా రైతులు అడ్డుకున్నారు. తమ సర్వే నంబర్ల పక్కనే పి వన్, పి టు, చేర్చి తనకు అక్కడ భూమి ఉన్నట్లు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై, నకిలీ పట్టాపాస్ పుస్తకాలను తీశారని రైతులు ఆరోపిస్తున్నారు. 2012-13లో ముషీరఫ్ జమ, సుల్తానా బేగం, సఫియా బేగం, పేర్లతో ఆ భూమి సర్వేనెంబర్‌లపై పి1 పి2 సృష్టించి, నకిలీ పట్టాపాస్ పుస్తకాలను రెవెన్యూ శాఖ ఇవ్వడంతో వాటిపై బ్యాంకులో లక్షల రూపాయల రుణాలను తీసుకున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ నకిలీ పట్టా పాస్ పుస్తకాలపై రెవెన్యూ శాఖ ఉన్నత అధికారులతో సమగ్ర సర్వే జరిపించి తమకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేశారు. సుమారు 50 మంది రైతులు తమ సంతకాలతో బ్యాంకు మేనేజర్‌తో పాటు సర్వేయర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో అధికారులు తిరిగి వెళ్లారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు జగదీష్ ధనుంజయ, గంగరాజు, నాని, మహేష్, బుదయ్య, సత్తయ్య 50 మంది రైతులున్నారు.



బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న రైతులు

బీఎస్పీ పార్టీని బద్నాం చేయడం సరికాదు

- బీఎస్పీ జిల్లా అధ్యక్షులు సింగడి పాండు

నవతెలంగాణ-బోధన్

బీఎస్పీ పార్టీలో తనకు సభ్యత్వం లేదని, తగిన సమాచారం ఇవ్వడం లేదని అమర్‌నాథ్ బాబు బీఎస్పీ పార్టీని బద్నాం చేరడం సరికాదని బీఎస్పీ జిల్లా అధ్యక్షులు సింగడి పాండు, జిల్లా ఇంచార్జి గైని గంగాధర్ అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. అమర్‌నాథ్ బాబు గత ఎన్నికల్లో బీఎస్పీ నుంచి పోటీచేసిన తర్వాత పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారని అన్నారు. ఆయనకు సభ్యత్వం లేకుండా బీఫాం ఎలా ఇస్తారని ప్రశ్నించారు. తన అవకాశాల కోసమే పార్టీని ఉపయోగించుకున్నారని ఆరోపించారు. అతనిని జనవరిలోనే పార్టీ నుంచి తొలగించినట్టు ప్రకటించారు. మళ్లీ పార్లమెంటు ఎన్నికల సందర్భంగా తెరపైకి వచ్చి రాజకీయ లబ్ది కోసం ప్రయత్నాలు చేస్తున్నాడని విమర్శించారు. పార్టీని బద్నాం చేసి బోధన్‌లో వ్యక్తి గత రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నారని అన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై అనవసర విమర్శలు చేస్తే సహించమన్నారు. అనంతరం మహిళల దినోత్సవం సందర్భంగా మహిళ నాయకులను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళ ఇన్చార్జ్ అరుణ జ్యోతి, జిల్లా మహిళా కన్వీనర్ లావణ్య, జిల్లా కోశాధికారి వీణాగౌడ్, కామారెడ్డి మహిళా కన్వీనర్ శమంత, బోధన్ అసెంబ్లీ ఇన్చార్జ్ శంకర్, బోధన్ అసెంబ్లీ ఉపాధ్యక్షులు రెడ్డి సాయిలు, ప్రధాన కార్యదర్శి సాయికుమార్, కోశాధికారి సుభాష్, బోధన్ మండలాధ్యక్షులు బాగారె గంగాధర్, భాగ్య, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సింగడిపాండు

తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు

- ప్రత్యేక అధికారి బండివార్ విజయ్

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్ర మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామ ప్రజలకు ఎలాంటి తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మేజర్ గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి డాక్టర్ బండివార్ విజయ్ గురువారం తెలిపారు. పంచాయతీ పరిధిలో హౌసింగ్ బోర్డ్ టీచర్స్ కాలనీలో పాడైపోయిన తాగునీటి బోరు మరమ్మతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ఏవాడలో కూడా తాగునీటి సమస్య వస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని గ్రామస్తులను కోరారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు ప్రత్యేక అధికారి తెలిపారు.

మతోన్మాద బీజేపీని చిత్తుగా ఓడించాలి

- సీఐటీయూ రాష్ట ఉపాధ్యక్షురాలు ఎస్.రమ
- ఘనంగా మహిళా దినోత్సవం

నవతెలంగాణ-కామారెడ్డి

దేశంలో కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తున్న మతోన్మాద బీజేపీని 2024లో చిత్తుచిత్తుగా ఓడించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.రమ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని మున్నూర్ కాపు కళ్యాణ మండపంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సీఐటియు జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ అధ్యక్షత ఘనంగా నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.రమ, తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ పాల్గొని ప్రసంగించారు. 1917లో సోషలిస్ట్ రష్యాలో విప్లవం విజయవంతం అయ్యాక ఎనిమిది గంటల పని దినం అమల్లోకి వచ్చిందని తెలిపారు. మహిళలకు ఓటు హక్కు ఇచ్చిందని వివరించారు. కార్మికులకు కనీస వేతనాలు కార్మిక చట్టాలు మహిళా కార్మికులకు చట్టబద్ధ సౌకర్యాలు కల్పించారని తెలిపారు. మన దేశంలో శ్రమను గుర్తించాలని, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందని, లేబర్ కోడ్స్ వెనక్కి తీసుకోవాలని అన్నారు. మహిళలు, పిల్లలపై అత్యాచారాలు హింస పెరిగిందని, సమాన పనికి - సమాన వేతనం కావాలని డిమాండ్ చేశారు. బిజెపి 2014లో అధికారంలోకి వచ్చాక మహిళలపై అనేక అత్యాచారాలు, హింస పెరిగిందని వివరించారు. గుజరాత్‌లో బిజెపి ప్రభుత్వం హయంలో బిల్కిస్‌భానోపై అత్యాచారం చేసి కోర్టు శిక్షిస్తే గుజరాత్ బిజెపి ప్రభుత్వం వారిని సత్ప్రవర్తన కలిగిన ఖైదీలుగా గుర్తించి వారికి జైలు నుంచి విడుదల చేశారని తెలిపారు. జైలు నుంచి విడుదల చేసి వారికి పూలదండలు వేసి శాలువాలు కప్పి ఊరేగింపు చేశారని, మణిపూర్‌లో బిజెపి ప్రభుత్వం ఇద్దరు గిరిజన మహిళలపై అత్యాచారం చేసి నగ్నంగా ఊరేగించిందని తెలిపారు. అలాగే మహిళా మల్లయోధులపై లైంగిక వేధింపులు అనేకం జరిగాయని చెప్పారు. ఈ విషయంలో బిజెపి పార్లమెంట్ సభ్యులు బిజ్‌భూషణ్ చరణ్ సింగ్‌కు కేంద్ర ప్రభుత్వం బాసటగా నిలిచిందన్నారు. కార్పొరేట్ అనుకూల, మతోన్మాద బీజేపీని 2024లో చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ సభలో సీఐటీయూ జిల్లా నాయకులు వెంకట్‌గౌడ్, కె.రాజనర్సు, తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మైబూబ్, ప్రభాకర్, దీపక్, తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు యాదమ్మ, సుకన్య, మెప్మా ఆర్‌పిలు, అధ్యక్ష, కార్యదర్శులు వెంకటలక్ష్మి, అనిత, మెగమాల, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు మమత, మున్సిపల్ యూనియన్ నాయకులు ఎల్.బుధవా, నడిపి నరసవ్వ, సువర్ణ, గురిజాల లక్ష్మి, భూదేవి, రాజమణి, భూదేవి, కె.సుజాత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.రమ



హాజరైన మహిళలు

గత ఎజెండాలే మళ్లీ పెట్టారు..

- తాగునీటి సమస్య మినహా మిగతా వాటికి ఆమోదం తెలుపబోం
- కాంగ్రెస్ కౌన్సిలర్లు
- పార్టీలకతీతంగా అభివృద్ధికి సహకరించండి
- ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

'గత ఎజెండాలే ఈ సమావేశంలోనూ మళ్లీ పెట్టారు. తాము తాగునీటి సమస్య మినహా మిగతా వాటికి ఆమోదం తెలుపబోం' అని కాంగ్రెస్ మున్సిపల్ కౌన్సిలర్లు స్పష్టం చేశారు. కామారెడ్డి మున్సిపల్ సాధారణ సమావేశం గురువారం మున్సిపల్ చైర్ పర్సన్ నిట్టు జాహ్నవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, మున్సిపల్ కమిషనర్ సుజాత, వైస్ చైర్‌పర్సన్ ఇందూ ప్రియ హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన 25 మంది కౌన్సిలర్లు ఈ సమావేశంలో ప్రవేశపెట్టిన ఎజెండాలకు తాము ఆమోదం తెలుపబోమని, గత రెండు సమావేశాల్లో పెట్టిన ఎజెండా అంశాలు తిరిగి వాటిని ఈ సమావేశంలో ప్రవేశపెట్టారని కాంగ్రెస్ కౌన్సిలర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి వార్డు ప్రజలు తమను వార్డు అభివృద్ధి కోసం ఎన్నుకున్నారని, పట్టణంలోని ప్రతివార్డుకు సమానంగా నిధులు కేటాయించాలన్నారు.

పార్టీలకతీతంగా పట్టణ అభివృద్ధికి సహకరించండి : ఎమ్మెల్యే..

పార్టీలకు అతీతంగా కామారెడ్డి పట్టణాన్ని అభివృద్ధి చేయడానికి బల్దియా పాలకవర్గం సభ్యులు, అధికారులు సహకరించాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. మున్సిపల్ సమావేశంలో భాగంగా ఎమ్మెల్యే రమణారెడ్డి మాట్లాడుతూ పట్టణంలో రోడ్ల వెడల్పు పనులు, మున్సిపల్ స్థలాల పరిరక్షణకు పాలకవర్గం సభ్యులు తమవంతు సహకారం అందించాలని కోరారు. కొత్తగా నిర్మించిన గృహాలను అధికారులు పరిశీలించి కొలతల ఆధారంగా పన్నులు వసూలు చేయాలన్నారు. రోడ్లపై చెత్త కుప్పలు వేస్తే వారికి జరిమానాలు విధించాలని సూచించారు. పట్టణ రోడ్లను పరిశుభ్రంగా ఉంచే విధంగా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ.. మున్సిపల్ అధికారులు అంకితభావంతో పనిచేయాలని తెలిపారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణ ప్రకృతి వనాలలో మొక్కలు ఎండిపోకుండా చూడాలని కోరారు. మున్సిపల్ సమావేశం ఎజెండా అంశాలు తమతో చర్చించకుండా మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవి, బీఆర్ఎస్ కౌన్సిలర్లు తయారు చేశారని, సమావేశాన్ని వాయిదా వేయాలని కాంగ్రెస్ కౌన్సిలర్లు తీర్మానపత్రాన్ని జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్ పర్సన్‌కు అందించారు. దీంతో సమావేశాన్ని త్వరలో ఏర్పాటు చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవి అన్నారు. ఈ సమావేశంలో పలు అంశాలను బిజెపి, బీఆర్ఎస్, కాంగ్రెస్ కౌన్సిలర్లు అధికారులను అడిగి తెలుసుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్



హాజరైన మున్సిపల్ కౌన్సిలర్లు

బైపాస్ రోడ్డు నిర్మాణం వద్దు

- మోర్తాడ్ రైతుల డిమాండ్
- జాతీయ రహదారిపై నిరసన



రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

నవతెలంగాణ-మోర్తాడ్

జాతీయ రహదారి నిర్మాణంలో బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయడం సరికాదంటూ మండల కేంద్రానికి చెందిన పలువురు రైతులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొన్నేండ్ల క్రితం వరద కాలువతో పాటు రైల్వేలైన్ నిర్మాణంలో తమ వ్యవసాయ భూములను కోల్పోయామని, ప్రస్తుతం బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టడం వల్ల ఉన్న కాస్త భూమి కోల్పోయి తాము రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత రోడ్డులో కేవలం 6 నిర్మాణ ఇండ్లు మాత్రమే నష్టపోతున్నప్పటికీ వ్యవసాయ భూములు ఏమీ లేవని బైపాస్ రోడ్డు నిర్మాణం చేపడితే 40 కుటుంబాల రైతులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని బైపాస్ రోడ్డు కాకుండా ప్రస్తుత రోడ్డునే వెడల్పు చేస్తూ రహదారి నిర్మాణం పనులు చేపట్టాలని కోరారు. బైపాస్ రోడ్డు నిర్మాణం చేపడితే తాము పూర్తి ఆస్తులను కోల్పోయి రోడ్డున పడి ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. తక్షణమే బైపాస్ రోడ్డు నిర్మాణం కాకుండా ప్రస్తుత రోడ్డునే వెడల్పు చేసి రైతులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు. నిరసనలో రైతులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-కోటగిరి

మండలంలోని హంగర్గఫారంలోని ఓ రేకుల షెడ్డులో తనిఖీ చేయగా సుమారు 5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్టు అధికారులు తెలిపారు. అక్రమ బియ్యాన్ని నిల్వఉంచిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

నవతెలంగాణ-రెంజల్

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఓటు హక్కు వినియోగంపై గురువారం అవగాహన కల్పించారు. అనంతరం వారికి రంగోలి, వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రిన్సిపాల్ చెన్నప్ప, జైనుల్, సంతోష్ కాంబ్లే, దామ్లా, జ్యోతి, సుష్మ, ఇఫ్రా నాజ్, సౌమ్య, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే ఇంట్లోని మురికి నీరు



మురికినీరు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలో ఓల్డ్ ఎన్‌హెచ్7 రహదారిపై మురికి నీరు ప్రవహిస్తున్నా పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కాలంలో 70 శాతం మురికి కాలువ నిర్మించిన మరోవైపు నిర్మించని కారణంగా మురికి నీరు రోడ్డుపై ప్రవహిస్తుందని త్వరగా మురికి కాలువ నిర్మించి రోడ్డుపై మురికి నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మరోవైపు సమీపంలో మురికి కాలువ ఉన్నా. మిషన్ భగీరథ వాల్ వద్దకు డ్రైనేజీ పైపు వేయడం వలన మురికి నీరు వాల్‌లోకి ప్రవహిస్తుంది. ఇంట్లోని నీరు రోడ్డుపై ప్రవహిస్తున్న కారణంగా వాహనదారులు, బాటసారులు వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డుపై మురికి నీరు ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
శుక్రవారం | మార్చి 08, 2024 | www.navatelangana.com

పంచాయతీలోనే గృహ జ్యోతి పత్రాలను అప్డేట్ చేయాలని వినతి

నవతెలంగాణ-నవీపేట్

గృహజ్యోతి పథకంలో ఉచిత విద్యుత్ జీరో బిల్లు రాని అర్హులందరికీ గ్రామపంచాయతీల్లోనే అప్డేట్ చేయాలని ఎంపీడీవో నాగనాథ్ కు గురువారం వినతి పత్రం అందించారు. గృహ జ్యోతి పథకంలో చాలామందికి జీరో బిల్ రానందున సాంకేతిక లోపాల కారణంగా అప్డేట్ కాలేదని విద్యుత్ అధికారులు తెలపడంతో వందల సంఖ్యలో ఎంపీడీవో కార్యాలయానికి తరలివచ్చి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాబట్టి వెంటనే ఆయా గ్రామ పంచాయతీలలోని ఆన్లైన్ కనెక్షన్ అప్డేట్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్ కుమార్, రమేష్, సతీష్ పాల్గొన్నారు.

తెలంగాణ ఆదర్శపాఠశాల, కళాశాలలో సైన్స్ డే, సైన్స్ ఎగ్జిబిషన్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో సైన్స్ డే సందర్భంగా జక్రాన్ పల్లిలో సైన్స్ డే (07/03/2024) సైన్సు ఎగ్జిబిషన్ ప్రదర్శించడం జరిగిందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజేష్ రెడ్డి తెలిపారు. ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ , విశిష్ట అతిథిగా జక్రాన్ పల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లింగన్న హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ నమూనాలను చూసి అభినందించారు. తెలంగాణ యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీ మహేందర్ ప్రదర్శించిన నమూనాలను చూసి విద్యార్థులకు సైన్సు పట్ల, శాస్త్రీయ పరిశోధనల పట్ల పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేష్ రెడ్డి, డిచ్ పల్లి ప్రిన్సిపాల్ గణేష్ , ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బిఎల్ఎఫ్ నిజామాబాద్ పార్లమెంట్ కన్వీనర్‌గా సబ్బని లత ఎన్నిక

నవతెలంగాణ-కంఠేశ్వర్

బిఎల్ఎఫ్ నిజామాబాద్ పార్లమెంట్ కన్వీనర్ గా సబ్బని లత, కో కన్వీనర్ గా మేత్రి రాజశేఖర్లను నియమించినట్లు బహుజన లెఫ్ట్ ఫ్రంట్ బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ తెలిపారు. ఈ మేరకు గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ రోడ్లు భవనాల అతిథి గృహంలో జరిగిన బహుజన లెఫ్ట్ ఫ్రంట్-బిఎల్ఎఫ్ నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల ఉమ్మడి సమావేశం నిర్వహించారు. సభ్యులు గా కె. శ్రీనివాస్ నిజామాబాద్ అర్బన్, కె.మధు నిజామాబాద్ అర్బన్, ఎ. అశోక్ గౌడ్ బాల్కొండ, బి. జగదీష్ బాల్కొండ, రూరల్ ఆకుల సుజాత, ఎండి సయ్యద్ నిజామాబాద్ రూరల్, మోసిన్ బోధన్, బాల్ రాజ్ బోధన్, టి. రాజు నిజామాబాద్ అర్బన్, జి.శ్రీమాన్ నిజామాబాద్, ఎం.అజయ్ నిజామాబాద్ అర్బన్, దండు జ్యోతి ఆర్మూర్ , టి . అంజయ్య నిజామాబాద్ రూరల్, సంగీత బోధన్, కోరుట్ల, జగిత్యాల లకు అబ్బగోని అశోక్ గౌడ్, బ్రాహ్మణపల్లి జగదీష్ లను ఇంచార్జీలుగా నియమించినట్లు దండివెంకట్ ప్రకటించారు.

10న టిఎస్‌డబ్ల్యూఆర్ సైనిక్ స్కూల్ సెట్ ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్ పాఠశాల, (సిబిఎస్ బి), రుక్మాపూర్, కరీంనగర్ జిల్లాలో 2024 -25 సంవత్సరానికి 6వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి సంబంధించిన ప్రవేశ పరీక్ష సైనిక్ స్కూల్ సెట్ -2024 ఈ నెల 10 (ఆదివారం) ఉంటుందని తెలిపారు. 6వ తరగతికి ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 1:00 గం. వరకు ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాలు, నిజామాబాద్ జిల్లాలో తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల, జూనియర్ కళాశాలలో బాలికలు డిచ్ పల్లి మండలంలోని సుద్దపల్లిలో, కామారెడ్డి జిల్లాలో దోమకొండ, నిర్మల్ జిల్లాలో జామ్‌లలో నిర్వహించనున్నట్టు ఆ సంస్థ ప్రాంతీయ సమన్వయాధికారిణి కె. అలివేలు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు www.tswreis.ac.in వెబ్ సైట్ ల ద్వారా అంతర్జాలం నుండి హాల్ టికెట్ లు ముందుగానే డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్షాకేంద్రాలను గుర్తించడంలో ఏవైనా ఇబ్బందులుంటే, హాల్ టికెట్‌లో ముద్రించిన ముఖ్య పర్యవేక్షకుని ఫోన్ నంబర్ కు ఫోన్ చేసి సమాచారం పొందవచ్చని తెలిపారు.

తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సిమెంట్ బెంచీల ఏర్పాటు

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని వెంచిర్యాల గ్రామానికి చెందిన పుట్టి లస్మన్న-ముత్తెమ్మల జ్ఞాపకర్థం వారి కుమారుడైన పుట్టి సుమన్ (ఆర్మీ జవాన్) వెంచిర్యాల్ గ్రామస్థుల సౌకర్యార్థం 8 సిమెంట్ బెంచిలను ఏర్పాటు చేశారు. రానున్న రోజుల్లో సైతం గ్రామానికి మరిన్ని సేవలను అందిస్తానని తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని రెంజర్ల గ్రామానికి చెందిన వడ్ల గన్నాజీ శ్రీనివాస్ మాతృమూర్తి కొద్దిరోజుల క్రితం మృతి చెందారు. విషయం తెలుసుకున్న రెంజర్ల గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యులైన సాలిగంటి నర్సింగ్ రూ.5 వేల రూపాయలను గురువారం బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం కింద అందచేశారు. ఆయన వెంట వారి స్నేహితులు, బాధిత కుటుంబసభ్యులు తదితరులు ఉన్నారు..

జీరో విద్యుత్ బిల్లులపై హర్షం

నవతెలంగాణ-భీంగల్ రూరల్

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన గృహ జ్యోతి (ఉచిత విద్యుత్)లో భాగంగా జాగిర్యల్, పల్లికొండ, లింగాపూర్,చెంగల్, బెజ్జోర పేద ప్రజలకు ఉచిత విద్యుత్ బిల్లు రావడంతో ప్రజలు ఆనందంలో మునిగి తేలుతున్నారు. గత ప్రభుత్వంలో వేలకు వేలు బిల్లు రావడంతో ఎంతో ఇబ్బందులు ఎదుర్కొన్నామని ఈ ప్రభుత్వం ద్వారా ఉచిత విద్యుత్ ఇవ్వడం ఎంతో సంతోషకరమని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులు బిల్లు కొట్టే సమయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఒకవేళ ఆ ఇంటి యజమాని గృహజ్యోతి పథకానికి అర్హుడు కానీ ఎడల మళ్లీ ప్రజా పాలనలో దరఖాస్తు ఇవ్వమని సూచనలు ఇస్తున్నారు.

మొక్కలకు ట్యాంకర్ ద్వారా నీటిని అందించాలి : ఎంపీడీవో



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంతోష్ కుమార్ మండలంలోని కుప్కల్ గ్రామంలో హరితహారం నర్సరీని సందర్శించారు. ఉపాధి హామీ సిబ్బందికి నర్సరీ పెంపకంలో సూచనలు చేశారు. గ్రామంలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్లకి టాంకర్ ద్వారా నీరుని అందించలని ఆదేశించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి, పారిశుధ్య కార్మికులతో నీటి సమస్య, పారిశుధ్య సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించినారు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించినారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవో జీ నర్సయ్య, టెక్నికల్ అసిస్టెంట్ స్వామి దాస్, పంచాయతీ కార్యదర్శి కిషన్, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేడు స్వామి వారి కళ్యాణ మహోత్సవాలు

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలోని పడిలేచిన మర్రిచెట్టు దేవస్థానం 'శ్రీ మహా శివలింగేశ్వర స్వామి' మహోత్సవాలు, మండలంలోని కొత్తపల్లి, వేంపల్లి గ్రామాలలో శివరాత్రిని పురస్కరించుకుని స్వామి వారి కళ్యాణ మహోత్సవాలు జరగనున్నాయి.కొత్తపల్లి గ్రామంలో 'శ్రీ శివ పార్వతుల' కళ్యాణ మహోత్సవాలు, వేంపల్లిలో 'శ్రీ రాజరాజేశ్వర' ఆలయాల్లో స్వామి వారి కళ్యాణ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. శనివారం రోజున భక్తుల సౌకర్యార్థం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఇట్టి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

అన్నింటా తానైనా..
అడుగడుగునా వివక్ష

- హక్కుల కోసం నిత్యం పోరాటం
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్

ఇంటికి ఆమె మహారాణి . ఇంట బయట అన్ని తానై ఆమె రాణిస్తుంది.. అన్ని రంగాల్లో తనదైన ముద్ర వేసుకొని నేటి ఆధునిక కాలంలో మహిళ దఢంగా నిలబడుతుంది ఎలా అయినా ఆమె నే ప్రత్యేకం. అయితే గతంలో వంటింటికే పరిమితమైన మహిళలు నేడు ఉద్యోగం, వ్యాపారం, రాజకీయ మొదలైన రంగాల్లో ప్రవేశించి మగవారికి దీటుగా రాణిస్తున్నారు. స్త్రీ అందంతోనే కాదు.. మాటలు, చేతలతో అందరి మెప్పు పొందుతుంది. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నవ తెలంగాణ కథనం...

మొట్టమొదటిసారిగా...

మొట్టమొదటిసారిగా అమెరికాలో జాతీయ మహిళా దినోత్సవాన్ని 1909 ఫిబ్రవరి 28న జరుపుకున్నారు.. ఆ తర్వాత ఏడాది కోపెన్హాగెన్ లో జరిగిన అంతర్జాతీయ మహిళా సమావేశంలో ప్రతి ఏటా అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయించారు.. 1913లో దీన్ని మార్చ్ 8వ తేదీకి మార్చారు. .అప్పటి నుంచి ఆ తేదీనే అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నారు.



చైనా, ఉక్రెయిన్ వియత్నాలలతో పాటు 15 దేశాల్లో ఈ రోజున అధికారిక సెలవుదినంగా పాటిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం సైతం నేడు ప్రభుత్వ మహిళ ఉద్యోగిలకు సాధారణ సెలవు దినంగా ప్రకటించింది.

వ్యవసాయంలో.. బీడీ పరిశ్రమలో...

లక్షలాది కుటుంబాలను పోషిస్తున్న బీడీ పరిశ్రమ మహిళలపైనే ఆధారపడి కొనసాగుతుంది. వారు నిత్యం బీడీలు చుడితే తప్ప కుటుంబాలు నడవని పరిస్థితి ఉమ్మడి జిల్లాల్లో ఉంది. ఎంతోమంది గల్ఫ్‌కు వలస వెళితె మహిళలు అంతా తామై నడిపిస్తున్నారు. జిల్లాలోని ఆర్మూర్ డివిజన్ వ్యవసాయంలో పేరుగాంచడం వెనక మహిళల పాత్ర ఎక్కువగా ఉంది. మండలంలోని అంకాపూర్ సీడ్ విలేజ్‌గా పేరు వచ్చిన అక్కడ 80శాతం వ్యవసాయం మహిళలదే.

గర్భంలో ఉన్నప్పటినుండే వివక్ష...

లేచింది.. నిద్ర లేచింది మహిళా లోకం.. దద్దరిల్లింది పురుష ప్రపంచం అంటూ సినీ గేయ రచయిత నాలుగు దశాబ్దాల కిందే మహిళల చైతన్యం గురించి పాట రాశారు. గర్భంలో పడినప్పటి నుంచి వివక్షకు గురవుతూనే ఉంది. అయితే మహిళలను రక్షించుకునేందుకు చట్టాలున్న అమలులో మాత్రం చుట్టాలుగా మారడంతో నేరాల సంఖ్య నానాటికి పెరుగుతుంది. వరకట్న నిరోధక చట్టం, గృహహింస చట్టం, లైంగిక వేధింపుల చట్టం ఇలా ఎన్ని చట్టాలున్నా చట్టుబండలే.. మహిళ ప్రజా ప్రతినిధులు పదవికి పరిమితం అవుతున్నారు. కుటుంబ సభ్యుల జోక్యం తగ్గడం లేదు.. మహిళ దినోత్సవం సమయంలోనైనా కాకుండా మిగతా సమయాల్లోనూ మహిళలకు గుర్తింపును ఇవ్వాలని ప్రభుత్వ ఉద్యోగాలలోను తగిన రిజర్వేషన్లు కల్పించాలని పలువురు మహిళలు కోరుతున్నారు.

చిన్ననాటి నుంచే సమానంగా చూడాలి..



బాలికలు బాలురు అనే తేడా లేకుండా అందరినీ సమానత్వంతో చూడగలగాలి.చిన్ననాటి నుండే సమానత్వం అలవాటు చేయాలి. మహిళలు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకొని ఉన్నత శిఖరాలను ధిరోహించగలగాలి..

డాక్టర్ యు, ఝాన్సీ రాణి, వైద్యురాలు,, శ్రీ బాలరాజ్ మెమోరియల్ హాస్పిటల్, ఆర్మూర్.

మహిళలు రాజకీయంగా రాణించాలి



ప్రస్తుత పరిస్థితులలో రాజకీయాల్లో మహిళల వెనుక వారి కుటుంబ సభ్యులు ఉంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో మార్పు రావాలి. మహిళలు స్వయంగా తామే నిర్ణయాలు తీసుకొని స్వతంత్రంగా వ్యవహరించగలగాలి. ఆర్థికంగాను స్వతంత్రంగాను ఎదిగేలా చిన్ననాటి నుంచి తల్లిదండ్రులు ప్రోత్సహించాలి.

డాక్టర్ అమృతలత, రచయిత్రి, విజయ్ విద్యాసంస్థల అధినేత్రి, ఆర్మూర్

మహిళలే.. గెలుపు నిర్ణేతలు...

జిల్లాలలో ఏ ఎన్నికలు జరిగిన మహిళలు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ముందుకు వస్తున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలే పురుషులకంటే అధిక సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.. అదే స్ఫూర్తితో గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ మహిళలే ముందు వరుసలో ఉన్నారు. గ్రామపంచాయతీ, మండల పరిషత్, పార్లమెంట్ ఎన్నికల్లోనూ మహిళలు గణనీయంగా ఓటు వేస్తూ

ఆదర్శంగా నిలుస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా పరిధిలోని 9 నియోజకవర్గాల్లో నమోదైన పోలింగ్ వివరాల్లో పురుషుల కంటే మహిళలే అధిక సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అభ్యర్థుల గెలుపోటములను మహిళలే నిర్ణయించారు.

ఉమ్మడి జిల్లాల నుండి రాణించిన, రాణిస్తున్న మహిళలు...

ఉమ్మడి జిల్లాల నుంచి శ్రమశక్తి నుంచి పరిశ్రమల వరకు మహిళల ప్రాతినిధ్యం ఎక్కువగా ఉంది. స్థానిక సంస్థల నుంచి సర్పంచ్,, మున్సిపల్ స్థాయి వరకు జడ్పీటీసీలు, ఎంపీపీలు, మున్సిపల్ చైర్ పర్సన్లు, మేయర్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జిల్లా స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు వారు తమ ప్రతిభను కనపరుస్తున్నారు. విద్య, వైద్యం, రాజకీయం, ఉద్యోగం, వ్యవసాయం, పరిశ్రమలు, సినిమా జర్నలిజం రంగాల్లో ప్రతిభ కనపరుస్తూ మగవారికి ధీటుగా సేవలు అందిస్తున్నారు.. జిల్లా జనాభాలో మహిళల శాతమే ఎక్కువగా ఉంది. మొత్తం జనాభాలో 50శాతం మహిళలు ఉండగా 49 శాతం పురుషులు ఉన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూతురు జిల్లా కోడలు కల్వకుంట్ల కవిత ఎమ్మెల్సీ పార్లమెంటుకు సారథ్యం వహించి తన గొంతును వినిపించారు. బోధన్ మండలంలోని అందాపూర్ గ్రామానికి చెందిన చిందుల ఎల్లమ్మ ఇందూరు జాతిని ఖండంతరాలలో నిలిపారు. చిందు కళాకారునిగా హంస పురస్కారాన్ని అందుకున్నారు. ఇందూరు ఝాన్సీ లక్ష్మీబాయిగ పేరుపొందిన సిర్నాపల్లి సంస్థా నా ధీశురాలు శీలం జానకి బాయి 1875 నుంచి 1921 వరకు పరిపాలించారు .ఆ సమయంలో నిజాంను మెప్పించి రైలు మార్గాన్ని ఏర్పాటు చేయించారు. జిల్లా అభివద్ధికి పాటుపడ్డారు. క్రీడల్లో యెండలా సౌందర్య, నికిత్ జరిన , హిమాలయ అధిరోహించిన మలావత్ పూర్ణ,,గతంలో కరీంనగర్ జిల్లా కలెక్టర్గా పనిచేసిన ఐఏఎస్ అరుణ, బాల్కొండ నియోజకవర్గంలోని కమ్మర్ పల్లి మండలంలోని చౌటుపల్లి గ్రామానికి చెందిన భోగ విశ్వ శ్రీ, క్రీ. శే. మాజీ ఎంపీ కేశ్ పల్లి గంగారెడ్డి మనవరాలు కీర్తి రెడ్డి సినిమా రంగంలో రాణించగా, గీతా సింగ్ టీవీ రంగంలో తన ప్రతిభను కనపరుస్తున్నారు.

జీవో 3 కారణంగా...

ప్రభుత్వ నియామకాల్లో జీవో మూడు కారణంగా మహిళా రిజర్వేషన్లు అమలులో జరుగుతున్న అన్యాయంపై నేడు నిర్వహించ తలపెట్టిన ధర్నాకు అనుమతి ఇవ్వాలని, శాంతియుతంగా దీక్ష నిర్వహిస్తామని భారత జాగతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత డిజిపిని కోరారు.

ఫీజు లేకుండా ఎల్ఆర్ఎస్ ధరఖాస్తులను ఆమోదించాలి

- బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎలాంటి ఫీజులు వసూలు చేయకుండా ప్రజల ఎల్ఆర్ఎస్ ఉచితంగా ప్రజలకు అందించాలని గురువారం సమీకత కలెక్టరేట్లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు బీఆర్ఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఏ ప్రభుత్వమైనా ప్రజలకు ఇచ్చిన హామిని అమలు చేసే దిశగా పనిచేయాల్సిన ప్రాథమిక బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం మీద ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సహ మంత్రులంతా ఎన్నికల ముందు అనేకసార్లు ఎల్ఆర్ఎస్ కార్యక్రమాన్ని ఉచితంగా ఎలాంటి ఫీజులు లేకుండా చేపడతామని హామి ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ప్రజల వద్ద నుండి ఫీజులు తీసుకోకుండా వారు దరఖాస్తు చేసుకున్న ప్లాట్లను ఉచితంగా క్రమబద్ధీకరిస్తామని హామీలు ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న వారితో పాటు స్వయంగా ముఖ్యమంత్రి ఇచ్చిన మాట మేరకు ప్రజల భూములను ఉచితంగా క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎల్ఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే ధరఖాస్తు పెట్టుకున్న 25 లక్షల ప్రజల ప్రయోజనాలను దష్టిలో ఉంచుకోవాలని తెలిపారు. వారిపై పడే సుమారు రూ.20 వేల కోట్ల రూపాయల భారాన్ని తప్పించేలా నిర్ణయం తీసుకోవాలన్నారు. ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుదారులకు ఫోన్లు చేయడం వంటి పద్ధతుల ద్వారా ఫీజులు కట్టమని ప్రభుత్వాధికారులు ఒత్తిడి చేయకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని, రైతంగ సమస్యను వెంటనే పరిష్కరించే దిశగా కషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షులు సిర్ప రాజు, సత్య ప్రకాష్, ప్యాట సంతోష్, సదానంద్, చింతకాయల రాజు, కరిపే రాజు, అగ్గు సంతోష్, మెతుకు శివకుమార్, తెలంగాణ శంకర్, మధు, నరేష్, అబ్దుల్ భారీ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మెడికవర్‌లో ఆరోగ్య శిబిరం

- అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా



ఆరోగ్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నిషిత కామర్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మెడికవర్ హాస్పిటల్‌తో కలిసి బాలికల కోసం ఒక రోజు ఆరోగ్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీసుష్మా నాగసూరి ఋతుస్రావ పరిశుభ్రత, హెచ్పీవి వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కళాశాల యాజమాన్యం, సిబ్బంది కలిసి డాక్టర్ సుష్మా నాగసూరి-ప్రసూతి గైనకాలజిస్ట్, డాక్టర్ యంగా కూరపాటి-అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్‌ను శాలువా మెమెంటోతో సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సి.వినయ కుమార్, ప్రిన్సిపాల్ ఎస్.జయంత్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డి. రాజన్న, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

శుభ్రమైన పౌష్టికాహారాన్ని అందజేయాలి

- ఆరోగ్య విస్తరణ అధికారి వై శంకర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

విద్యార్థులకు పరిశుభ్రమైన పౌష్టికాహారాన్ని అందజేయాలని ఆరోగ్య విస్తరణ అధికారి వై శంకర్ అన్నారు. మండలంలోని సుద్దపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో గురువారం మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ భోజనశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటకు వాడే నీరు, తాగునీరు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. వంటలో ఉపయోగించే ఉప్పు అయోడైజ్డ్ సాల్ట్ ను వాడాలని సలహా ఇచ్చారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, పౌష్టికరమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. అదే అయోడైజ్డ్ సాల్ట్ వాడడం వల్ల విద్యార్థుల్లో తెలివి తేటలు పెరుగుతాయని, థైరాయిడ్ సమస్య పోతుందని మరు గుజ్జు తనం, బుద్ధి మాంద్యం తగ్గుతుందని వివరించారు. వంట పూర్తయిన తర్వాతనే అయోడైజ్డ్ సాల్ట్ ను వేయాలని సూచించారు. తాజా కూరగాయలు ఆకుకూరలతో మెనూ ప్రకారం భోజనం అందించే విధంగా చూడాలన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రత్యేకమైన ఆహారాన్ని అందించాలని ప్రిన్సిపాల్ గోదావరికి వివరించారు. విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోదావరి,నర్స్, కేర్టెకర్, ఆరోగ్య కార్యకర్తలు గంగుబాయి, ఇందిరా, ఆశా కార్యకర్తలు నిరోశ పాల్గొన్నారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న ఆరోగ్య విస్తరణ అధికారి

కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ



కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-మోపాల్

మండలానికి చెందిన 35మందికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను గురువారం రూరల్ క్యాంప్ కార్యాలయంలో డాక్టర్ భూపతిరెడ్డి తో కలిసి కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ కల్యాణ లక్ష్మి చెక్కులను గత ప్రభుత్వంలో లాగా ఆలస్యం చేయకుండా వెళ్లి వెంటనే అందించే విధంగా చూస్తామని తెలిపారు. ఆరు గ్యారెంటీల్లో మూడు గ్యారెంటీ పథకాలను ఇప్పటికి అమలు చేశామని గృహలక్ష్మి పథకం కూడా ఈ నెల 11న భద్రాద్రిలో ఇందిరమ్మ ఇల్లు పథకం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారన్నారు. మొదటి దశలో ప్రతి నియోజకవర్గనికి 3500 ఇళ్లను అందజేస్తున్నారని తెలిపారు. పార్లమెంటు ఎలక్షన్లో కచ్చితంగా అత్యధిక స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలిచి తెలంగాణ ఇచ్చిన సోనియమ్మకు కానుకగా ఇస్తామని ఆయన తెలిపారు. యే గ్రామంలో నీటి సమస్య ఉన్న తమ దష్టికి తీసుకురావాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయిరెడ్డి, టిపిసిసి డెలిగేట్ శేఖర్ గౌడ్, న్యాల్కల్ మాజీ సర్పంచ్ గంగా ప్రసాద్, మాజీ ఉప సర్పంచ్ సతీష్ రావు, తహసీల్దార్ రామేశ్వర్, ఆర్ఐ రాజేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

- టీం లీడర్ నిట్టు కిషన్ రావు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గ్రామాలలో పేరుకుపోయిన ఇంటి పన్నుల వసూళ్లక కోసమే ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేయడం జరిగిందని, గ్రామస్తులు సహకరించాలని టీం లీడర్ నిట్టు కిషన్ రావు అన్నారు. గురువారం డిచ్ పల్లి మండలం లోని బీబీ పూర్ తండా లో ఇంటింటికి తిరిగి పన్నులను వసూలు చేశారు. ఈ సందర్భంగా టీం లీడర్ నిట్టు కిషన్ రావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో డబ్బులు ఉంటేనే గ్రామంలో అనేక అభివద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, వేసవి లో తాగు నీటికి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. పేరుకుపోయిన పనులను వసూలు చేయడానికి ప్రత్యేక టీం లను ఏర్పాటు చేశారని వివరించారు. ముందుగా కేటాయించిన గ్రామాల్లో పన్ను వసూళ్ళు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ముల్తాన్‌బి, శిల్ప, స్టీఫెన్, శ్రావణి, జయశ్రీ, శ్రవంతి, కారోబార్ పాల్గొన్నారు.



పన్నులను వసూలు చేస్తున్న అధికారి

ముస్తాబైన త్రిలింగ రామేశ్వర ఆలయం



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నాగిరెడ్డిపేట్ మండలంలోని తాండూరు గ్రామంలో గల పురాతన త్రిలింగ రామేశ్వర ఆలయం ముస్తాబైంది. మహాశివరాత్రి పురస్కరించుకొని తాండూర్ గ్రామంలో గల త్రిలింగ రామేశ్వర ఆలయం వద్ద మూడు రోజులపాటు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. శివరాత్రి సందర్భంగా మొదటి రోజు అభిషేకాలు, భజన కార్యక్రమాలు చేపడతారు. అదే విధంగా శనివారం ఎడ్లబండ్ల ప్రదర్శన ఉంటుంది. ఆదివారం సాయంత్రం రాత్రి భజన కార్యక్రమాలు తెల్లవారుజామున రథోత్సవం నిర్వహిస్తారు.

జువ్వాడి గ్రామాభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని జువ్వాడి గ్రామాభివృద్ధి కమిటీని గ్రామస్తులు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గుర్రం శ్యామ్, ఉపాధ్యక్షులుగా వడ్ల శ్రీనివాస్, బద్దం పెద్ద రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పల్లె కిషన్, కార్యదర్శిగా చాకలి సాయిలు, క్యాషియర్‌గా గొల్ల సాయిమల్లు, జాయింట్ చెక్‌పవర్ చిన్నోల్ల లస్మయ్య, సలహాదారులుగా మైముద్ అలీ, గొలుసు రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



ఎన్నికైన నూతన కార్యవర్గం ఎన్నిక

పురాణ కాలంలోనే స్త్రీకి ఉన్నతస్థానం

- జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జ్ శ్రీదేవి

నవతెలంగాణ-కామారెడ్డి

స్త్రీ ఆదిశక్తి అని, పురాణ కాలంలోనే స్త్రీకి ఉన్నతస్థానం ఇచ్చి గౌరవించారని జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జ్ టి.కె. శ్రీదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా న్యాయ సేవా సంస్థ, జిల్లా పాలనా యంత్రాంగం, పోలీసు యంత్రాంగం సహకారంతో జిల్లా కోర్టు సముదాయం నుంచి నిజాంసాగర్ చౌరస్తా వరకు ఏర్పాటు చేసిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. బాలికలను, మహిళలను రక్షిద్దాం, బాలికలను చదివిద్దాం, మహిళా సాధికారతను సాదిద్దాం అనే ప్లకార్డులు, నినాదాలతో ఎంతో ఉత్సాహంగా ర్యాలీ కొనసాగించారు. అనంతరం నిజాంసాగర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ.. ఒక మహిళ తల్లిగా, చెల్లిగా, భార్యగా, ఎంతో సేవ చేస్తుందని, ఆ మానవతా మూర్తికి అవకాశాలు ఇస్తే అంతరిక్షానికైనా వెళ్తారని అన్నారు. వారిని ముందుకు నడిపించుటలో పురుషులు ప్రోత్సాహం ఇవ్వాలని తెలిపారు. మహిళలు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారని, నమ్మకంగా పనిచేసే గుణం వారిలో ఉందని, వంటింటికి పరిమితం కాకుండా వివిధ రంగాలలో రాణిస్తే దేశం పురోగమిస్తుందని అన్నారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ.. మహిళలు ఇంటా, బయట అన్ని రంగాలలో పురుషులతో పాటు సమానంగా రాణిస్తుండడం విశేషమని తెలిపారు. మహిళా సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు పరుస్తున్నదని వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలపడాలని అన్నారు. జిల్లా యంత్రాగం కూడా అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కొంటూ ముందుకు సాగాలని, దైనందిన జీవితంలో, మంచి విజయాలు సాధిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. జిల్లా ఎస్పీ సింధు శర్మ మాట్లాడుతూ.. మహిళలకు ప్రత్యేకించి ఒక రోజు కేటాయించి పండుగ వాతావరణంలో కార్యక్రమాలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా క్రీడలలో, సాంస్కృతిక రంగాలలో జిల్లా స్థాయిలో మంచి ప్రతిభ కనబరచిన మహిళా క్రీడాకారులను సన్మానించుకుంటున్నామని అన్నారు. ఈ సందర్భంగా పలువురిని శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. అంతకుముందు ఉదయం కోర్టు సముదాయంలో ఆరోగ్య మహిళా, ఆరోగ్య కుటుంబం, ఆరోగ్యమైన సమాజం అంశంపై విద్య, వైద్యం, పొలిసు, జర్నలిజం, వృద్ధాశ్రమం, తదితర ఉన్నత రంగాల నుంచి మహిళలు సమావేశమై మహిళా సాధికారతపై చర్చించారు. ఈ సందర్భంగా నిర్వహించిన యోగాలో జిల్లా సెషన్స్ జడ్జి శ్రీదేవి, ఎస్పీ సింధూ శర్మ కలెక్టర్ సతీమణి శ్రద్ధ మహాజన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధు శర్మ సీనియర్ సివిల్ జడ్జి నాగరాణి, మహిళలు, ఎన్.సి.సి. క్యాడేట్లు, ట్రైనీ ఎస్పీ కాజల్‌సింగ్, డి.ఎఫ్.ఓ.నిఖిత, జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, ఎస్సి అభివృద్ధి అధికారి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి శ్రీదేవి



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, ఉన్నతాధికారులు

కాలిపోయిన మహిళ శవం లభ్యం

నవతెలంగాణ-పిట్లం

సగ భాగం కాలిపోయిన గుర్తుతెలియని మహిళా శవం లభ్యమైంది. ఈ ఘటన గద్దెగుండు తండా సమీపంలోని అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. ఎస్సై నిరేష్ వివరాల ప్రకారం.. గద్దెగుండు తాండ నేషనల్ హైవే 161రోడ్డు పక్కన గల అటవీ ప్రాంతంలో ఒక గుర్తు తెలియని స్థితిలో శవం కాలిపోయి గుర్తు పట్టరాని స్థితిలో ఉన్న మహిళా శవం లభ్యంమైంది. ఆ మహిళ వయస్సు (25-35) వరకు ఉంటుంది. బ్లూ కలర్ చీర, క్రీమ్ కలర్ బ్లౌజ్, చేతికి పసుపు ఎరుపు కలర్ గాజులు, కాళ్లకు వెండి పట్టే గొలుసులు ఉండి సుమారు 20 రోజుల క్రితం మరణించినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి వివరాలు తెలిసినవాళ్లు స్థానిక స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

తిమ్మోజివాడి గ్రామ పంచాయతీ పరిశీలన

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని తిమ్మోజివాడి గ్రామ పంచాయతీని డి.యల్.పి.ఓ శ్రీనివాస్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం వైకుంఠధామం, కంపోస్ట్‌షెడ్, నర్సరీని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో సురేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష అట్టలు అందజేత

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని ఆత్మకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జబీన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మకూర్ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ప్రస్తుతం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేసినట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో వారి వెంట పాఠశాల ఉపాధ్యాయులు అరవింద్ ఉన్నారు.

ప్రజలకిచ్చిన హామీలను నెరవేరుస్తున్న కాంగ్రెస్

నవతెలంగాణ-మద్నూర్

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిందని ఎన్ఎస్‌యూఐ మండలాధ్యక్షులు బస్వరాజ్ పటేల్ తెలిపారు. మద్నూర్ మండలంలోని చిన్నఎక్లారా గ్రామంలో గృహజ్యోతి, ఉచిత కరెంటు పథకాన్ని అమలు చేసిందని పేర్కొన్నారు. గృహజ్యోతి పథకం అమలుతో గ్రామ ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ అధ్యక్షులు మధుకర్ పటేల్, గ్రామ ఉపాధ్యక్షులు మల్లికార్జున్‌పటేల్, గనుపటేల్, నాగనాథ్ పటేల్, సురేష్ పటేల్, అశోక్ పటేల్, గ్రామస్తులు, లైన్‌మెన్ ప్రకాష్, బిల్ కలెక్టర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-దోమకొండ

ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. కలెక్టర్ ఆదేశానుసారం దోమకొండ మండల సమాఖ్య ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం రాజు, డిప్యూటీ తహసీల్దార్ రేఖ ఆధ్వర్యంలో ఓటు హక్కు ప్రాముఖ్యతపై గురువారం గ్రామ సంఘం మహిళలకు ముగ్గులు, మెహెందీ పోటీలను యస్విఇఇపి (సిస్టమెటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్, ఎలక్ట్రోల్ పార్టిసిపేషన్) నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించేలా అవగాహన కల్పించారు. మహిళలను ఎడ్యుకేట్ చేయాలని అన్నారు. పోటీలో గెలుపొందిన వారికి మొదటి, రెండవ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీసీలు రమేష్, రామకృష్ణ, అకౌంటెంట్ స్వాతి, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

ఆరో విడత నిజాంసాగర్ నీటి విడుదల

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని నిజంసాగర్ ప్రాజెక్టు నుంచి యాసంగి పంట సాగు కోసం నేటి నుంచి ఆరో విడత నీటిని విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్ట్ ఇంజనీర్ శివ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులందరూ కూడా నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన సూచించారు. నీటిని వృథాగా పోనివ్వకూడదని ఆయన పేర్కొన్నారు. ప్రతిరోజు 2000 క్యూసెక్కుల చొప్పున 10 రోజులపాటు నీటిని వదులుతామని ఆయన తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 17.802 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.870 టీఎంసీల నీరు నిల్వఉందని ఆయన తెలిపారు. ఇంకా ఒక విడత మాత్రమే మిగిలి ఉంటుందని ఆయన సూచించారు. కాబట్టి రైతులందరూ కూడా పంట సాగు కోసం నీరు ఉపయోగించుకోవాలని ఆయన సూచించాడు.

పాఠశాలల తనిఖీ



విద్యార్థినిలో మాట్లాడుతున్న రామచందర్

నవతెలంగాణ-నిజాంసాగర్

ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిజాంసాగర్ కాంప్లెక్స్ పరిధిలోని నర్వ, హసన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎస్.రామచందర్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యపై ఆసక్తిని కలిగించాలని ఆయన అన్నారు. అనంతరం పాఠశాలలోని ఉపాధ్యాయుల హాజరు పట్టికను విద్యార్థుల అడ్మిషన్ రిజిస్టర్‌లను పరిశీలించారు. అడ్మిషన్ రిజిస్టర్ రాసే క్రమంలో తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి ప్రధానోపాధ్యాయులకు వివరించారు. అనంతరం మధ్యాహ్న భోజనానికి సంబంధించిన స్టాక్ రిజిస్టర్‌లను, అటెండెన్స్ రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. విద్యార్థుల వర్కు బుక్‌లను పరిశీలించి పాఠ్యపుస్తకానికి వర్కు బుక్‌లను సమానంగా విద్యాబోధన చేయాలని ఆయన సూచించారు. పాఠశాలలోని అన్ని తరగతి గదులను పర్యవేక్షించి బ్లాక్‌బోర్డ్‌ల పనితీరును పరిశీలించారు. అలాగే లైబ్రరీ పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని విద్యార్థులకు లైబ్రరీ పీరియడ్లో తప్పకుండా పుస్తకాలను ఇవ్వాలని ఇచ్చిన పుస్తకాలను రిజిస్టర్‌లో పొందుపరచాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ జోషి, చంద్రశేఖర్, సీఆర్పీలు బి.శ్రీధర్‌కుమార్, పి.నర్సింహులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని మల్లూరు గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల నుంచి రూ.20లక్షల నూతన గ్రామపంచాయతీ భవనానికి మండల నాయకులు పెద్దిహన్మండ్లు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు చొరవతో నూతన పంచాయతీ భవనానికి నాంది పలికిందన్నారు. కార్యక్రమంలో బుడిమే గంగాధర్, గొల్ల హన్మండ్లు, నాగంపల్లికృష్ణ, బుడిమేసతీష్, భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఎడ్లబాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఎడపల్లి : బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ అమీర్ జన్మదిన వేడుకలను మండలంలోని మంగళ్‌పాడ్, కుర్నాపల్లి తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఎడపల్లి ఎంపీపీ కె.శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీటీసీలు అరుగుల వనజ నాగరాజు, షేక్ జావిద్ బాబా, బిఆర్ఎస్ మండలాధ్యక్షులు దేరడి శ్రీరామ్, నాయకులు సదానందం, పాషా, రవీందర్‌గౌడ్, ఆకుల శ్రీనివాస్, ఆకుల సురేష్, బాబార్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ చేసిన బీఆర్ఎస్ నాయకులు

బోధన్ : మాజీ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ జన్మదినం పురస్కరించుకొని గురువారం బోధన్ పట్టణంలోని జిల్లా ఆసుపత్రిలో పట్టణ బీఆర్ఎస్ నాయకులు రవీందర్ యాదవ్, రవిశంకర్‌గౌడ్, బెంజర్ గంగారాం రోగులకు పండ్లను పంపిణీ చేశారు. అలాగే బోధన్ మండలం బండారుపల్లి గ్రామంలో నాయకులు కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మెన్ సాలురా షకీల్, సిర్ప సుదర్శన్, నీలంగి గణేష్ పటేల్, కొప్పర్గ గంగాధర్,మాజీ సర్పంచ్‌లు, వార్డ్ మెంబర్స్, సొసైటీ డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెంజల్ : మండలంలోని సాటాపూర్ గ్రామంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో భవిత దివ్యాంగుల పిల్లల సమక్షంలో మాజీ సర్పంచ్ వికార్పాషా ఆధ్వర్యంలో బోధన్ మాజీ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా దివ్యాంగుల చిన్నారులకు కేక్ కట్ చేసి వారికి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎస్కే అహ్మద్, కే సాయిలు, హైమద్, పటాన్, రఫీ ఖాన్, భూమేష్, జాడి సాయిలు, డైరెక్టర్ సాయిలు, నరేష్, ఇమ్రాన్, మధు, రాజు, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.



ఎడపల్లి: చిన్నారులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



బోధన్‌లో...

గట్టి సంకల్పం ఉంటే ఏదైనా సాధ్యమే

నవతెలంగాణ-సదాశివనగర్

గట్టి సంకల్పం ఉంటే ఎదైనా సాధ్యమేనని హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. మండలంలోని వజ్జేపల్లి, ఉత్తునూర్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు విజయస్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు ఉత్తునూర్ సింగిల్ విండో చైర్మన్ కాట్మండి ప్రభాకర్ రావు, కాట్మండి సంతోష్‌కుమార్, సంతోష్ పాటిల్ మాట్లాడుతూ గట్టి సంకల్ప బలంతో ప్రతి విద్యార్థి ప్రణాళికతో ముందుకు వెళ్తే ఉన్నత శిఖరాలను చేరతారని అన్నారు. నమ్మకంతో, ఆత్మవిశ్వాసంతో, ప్రణాళికతో కష్టపడాలని అప్పుడే విజయం మనకు దాసోహం అవుతుందని తెలిపారు. ఉత్తనూర్ ఉన్నత పాఠశాలలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.5000 బహుమతిగా అందజేస్తామని కాట్మండి సంతోష్ పాటిల్ తెలిపారు. తదనంతరం హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధి జైపాల్ రెడ్డి విద్యార్థులకు పదవ తరగతి తర్వాత ఉన్నత విద్య ఉద్యోగ అవకాశాల గురించి అవగాహన కల్పించారు. వజ్జేపల్లి, ఉత్తునూర్ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు కాట్మండి సంతోష్ పాటిల్, ప్రభాకర్ రావుల ఆర్థిక సహాయంతో పరీక్ష కిట్లను బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ బ్రిడ్జి ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు కృష్ణాకర్‌రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం బాపురెడ్డి, శ్రీనివాస్, రాణి, కాట్మండి సంతోష్‌కుమార్, శివ పాటిల్, రమాకాంత్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్యాడ్స్ అందజేత

మీ రుణం తీర్చుకోలేనిది



నవతెలంగాణ-కామారెడ్డి

సోనియాశంకర్ ఫౌండేషన్ వైస్ చైర్మన్ సోనియా శంకర్ రుణం తీర్చుకోలేనిదని మగ్గం వర్క్ శిక్షణ తీసుకుంటున్న మహిళలు అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం ఆమెను శాలువాతో సన్మానించి పూల బోకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ తమ వద్ద ఎలాంటి శిక్షణ ఫీజు తీసుకోకుండా ఉచితంగా ఎంతో ఓర్పుతో తమకు మగ్గం వర్క్ శిక్షణ, టైలరింగ్ శిక్షణ ఇస్తున్న సోనియాను ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. ఈ శిక్షణ ఇవ్వడమే కాకుండా చలికాలంలో పేదలకు, వృద్ధాశ్రమంలో ఉండే వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేస్తూ ఆమె తమ దయార్ద్ర హృదయాన్ని చాటుతున్నారన్నారు. కార్యక్రమంలో హెచ్.ప్రణీత, ఆర్.అంజలి, ఏ తరుణి, ఏ శృతి, జి.సౌమ్య, ఆర్.భవ్య, ఎం.పూజ, ఎం.రమ్య, డి.సుకన్య, డి.శిరీష తదితరులు పాల్గొన్నారు.

కొండకోనల్లో

- శ్రీస్వయంభూబుగ్గ రామలింగేశ్వర ఆలయం
- సందర్శకులను ఆకట్టుకుంటున్న జలపాతం
- వృద్ధాశ్రమంతో సామాజిక సేవ
- నిత్యాన్నదానంతో ఆకలి తీర్చుతున్న ఆలయ కమిటీ

నవతెలంగాణ-రామారెడ్డి

చుట్టూ ఆకుపచ్చని అడవి.. అక్కడే కొండకోనలు.. మధ్యన శ్రీస్వయంభూబుగ్గ రామలింగేశ్వర ఆలయం ఆకట్టుకుంటోంది. శివరాత్రిని పురస్కరించుకుని ఈ ఆలయం వద్ద ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించారు. అందులో భాగంగా ఆలయ నిర్వాహకులు ఇక్కడ అన్నీ ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో నవతెలంగాణ ప్రత్యేక కథనం.

కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలోని మద్దికుంట గ్రామానికి రెండున్నర కిలోమీటర్ల దూరంలో దట్టమైన అడవిలో పుట్టు లింగమై, కొలువుదీరాడు లింగేశ్వరుడని ఇక్కడి ప్రజలు చెబుతున్నారు. గత 40 సంవత్సరాల క్రితం మద్దికుంటతో పాటు చుట్టుపక్కల గ్రామాలు కాలినడకన వెళ్లి స్వామి వారిని దర్శించుకునేవారు. గత 23 సంవత్సరాల క్రితం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో, ఆలయ కమిటీని ఏర్పరచుకొని ఆలయ అభివృద్ధికి కులమతాలకతీతంగా ఆలయ అభివృద్ధికి నడుం బిగించారు. ఇంతింతై వటుడింతై అన్న చందంగా, దినదినం ఆలయం అభివృద్ధి చెందుతోంది. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, మాచారెడ్డి ఎంపీపీ లోయపల్లి నర్సింహారావు ఆధ్వర్యంలో గతంలో ఆలయానికి బీటీ రోడ్డు, విద్యుత్ సరఫరా, అన్నదాన సత్రం, వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో ఆలయ అభివృద్ధి దాతల సహకారంతో శరవేగంగా అభివృద్ధి చెందుతూ, నిత్య అన్నదానం, గోశాల, వృద్ధాశ్రమం, సందర్శకుల బస చేయడానికి, అన్ని సౌకర్యాలతో కాంప్లెక్స్ గదుల సౌకర్యం, పచ్చని అడవుల మధ్యన కొలువుదీరడంతో సందర్శకులు తెలంగాణతో పాటు ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు వంటి రాష్ట్రాల నుంచి ఆలయ సందర్శనార్థం విచ్చేస్తున్నారు.



ఘనంగా ఉత్సవాలు..

ముఖ్యంగా ప్రతిరోజు దాదాపు 400 మందికి అన్నదాన కార్యక్రమం, పేదలకు ఉచిత వివాహం, దాదాపు 40 మంది వృద్ధాశ్రమంలో ఆశ్రమం పొందుతున్నారంటే భక్తితో పాటు, ఆలయ కమిటీ సామాజిక సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఆలయంలో శివరాత్రి పురస్కరించుకొని మూడు రోజులు ఘనంగా ఉత్సవాలను నిర్వహిస్తారు. గురువారం అఖండ దీపారాధన, రాత్రి పల్లకి సేవ గ్రామంలో ఊరేగింపు, శుక్రవారం ఉదయం 11:05 నిమిషాలకు అంగరంగ వైభవంగా శివపార్వతుల కళ్యాణం, సాయంత్రం 4:00 గంటలకు రథోత్సవం, శనివారం ఉదయం అగ్నిగుండములు, రుద్రాభిషేక కార్యక్రమాలతో ఉత్సవాలు పూర్తవుతాయి.

అధిక సంఖ్యలో రావాలి



శివరాత్రి ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలి. శివరాత్రిని పురస్కరించుకుని శనివారం వరకు ఉత్సవాలు ఉంటాయి.

- జంగం ప్రభాకర్ స్వామి, ఆలయ ప్రధాన పూజారి

అన్ని ఏర్పాట్లు చేశాం



శివరాత్రి ఉత్సవాలకు భక్తుల కోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేశాం. భక్తుల కోసం పోలీసు వారిచే పార్కింగ్, శాంతిభద్రతలు, ఆరోగ్యశాఖ వారిచే మెడికల్ క్యాంప్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఆహ్లాదకరమైన వాతావరణంలో చిన్న పిల్లల ఆట వస్తువులను సైతం ఏర్పాటు చేశాం.

- గోజారి లచ్చిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్

ఫీజుల పేరుతో విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఫీజుల పేరుతో విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దని ఎల్ఎస్ఓ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ జీవన్ అన్నారు. నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌజ్‌లో లంబాడి స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులను ఫీజుల పేరుతో ప్రైవేట్ పాఠశాలలు హాల్ టికెట్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టొద్దని అన్నారు. కొన్ని ప్రైవేట్ పాఠశాలలు మొత్తం ఫీజు కడితేనే హాల్ టికెట్ ఇస్తామని విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకుని ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. ఎస్సి, ఎస్టీ విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలలో 25 శాతం ఉచిత విద్యను అందించని పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జాదవ్ సాయి, కృష్ణ,జైపాల్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-ఏర్గట్ల

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీల్లో భాగంగా గృహజ్యోతి, గృహలక్ష్మీ పథకాలను అమలు చేయడంతో మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి మహిళలు, కార్యకర్తలు పాలాభిషేకం చేశారు.అనంతరం మహిళలకు జీరో బిల్లు, సిలిండర్ నమూనాలను చూపుతూ పథకాలను గురించి సునీల్ రెడ్డి వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సోమా దేవరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివ కుమార్, నాయకులు ఆడేం గంగాప్రసాద్, గడ్డం జీవన్,ముస్కు మోహన్ రెడ్డి, బెజ్జారం భాను,జింక అనిల్,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.బద్దం జితేందర్, బద్దం లింగారెడ్డి పాల్గొన్నారు.

పిల్లల్లో సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహించాలి

- మోటివేటర్ తిరునగరి శ్రీహరి

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణంలోని గాంధీనగర్ ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో 'మాతృమూర్తుల సాధికారత – పిల్లల్ని పెంచడంలో తల్లి పాత్ర' ఎంపవర్ మామ్స్ కార్యక్రమం గురువారం నిర్వహిచారు. ముఖ్య వక్తగా వచ్చిన మోటివేషనల్ స్పీకర్ తిరునగరి శ్రీహరి మాట్లాడుతూ పిల్లల్ని పెంచడం ఒక గొప్ప కళ అని అన్నారు. పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారిని ఆ దిశగా ప్రోత్సహించాలని ఆయన అన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఆయన అన్నారు. పిల్లలను ప్రతి విషయానికి శిక్షించకుండా ప్రేమ ఆప్యాయతలతో పిల్లల మనసులు మార్చాలని తల్లులకు సూచించారు. ఇతర పిల్లతో పోల్చడం వల్ల పిల్లల్లో ద్వేష భావం పెరుగుతుం దని ఆయన అన్నారు. స్నేహభావంతో పెంచిన పిల్లలు సమాజానికి ప్రేమను పంచుతారని ఆయన అన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మానస గణేష్ మాట్లాడుతూ చాలా కుటుంబాలలో తండ్రి ఉద్యోగ వ్యాపార ఒత్తిళ్లతో పిల్లలను పెంచే బాధ్యత తల్లికి అప్పజెప్పుతున్నారని అన్నారు. అందుకే ఈరోజు తల్లులకు పిల్లల్ని పెంచడం ఎలా?' అనే శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. తమ పిల్లలను గొప్ప వారిగా తయారుచేసి మంచి సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని అన్నారు. తిరునగరి శ్రీహరి ప్రసంగానికి చాలా మంది తల్లులు బాగోద్వేగానికి లోనయ్యారు. తల్లులు తమ పిల్లలని గుండెలకు హత్తుకొని కంటతడి పెడుతూ గద్గత స్వరంతో తమ భావాలని పంచుకున్నారు. కార్యక్రమంలో మోటివేషనల్ స్పీకర్ తిరునగరి శ్రీహరి వారి బృందాన్ని పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మానస గణేష్ పాలనాధికారిణి పద్మ, శిక్షణ బృందం సభ్యులు మహిపాల్ నరహరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఆర్మూర్

బీఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం పట్టణంలోని మామిడిపల్లి తపస్వి స్వచ్ఛంద సేవ సంస్థలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ రాజేశ్వర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు పూజ నరేందర్, లింబాద్రి గౌడ్, అల్జాపూర్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు మండల కేంద్రంలో సొసైటీ ఆవరణలో మండల పార్టీ ఆధ్వర్యంలో పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ, మండల పార్టీ అధ్యక్షుడు ఆలూర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జీవనన్న ప్రజా సేవలో నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో ఉండాలని మనసారా కోరుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ తంబూరి శ్రీనివాస్, మండల ఎంపిటిసిలు లక్ష్మీ మల్లేష్, అనూష శ్రీనివాస్ గౌడ్, భూదేవి భూమన్న, ఆలూరు గ్రామ మాజీ సర్పంచ్ కళ్లెంమోహన్, ఉపసర్పంచ్ దుమ్మాజీ శ్రీనివాస్, పార్టీ యూత్ అధ్యక్షుడు తొగరి భూషణ్, ఉపాధ్యక్షుడు క్రాంతి, ఆలూరు గ్రామ అధ్యక్షుడు రేగుల రజనీకాంత్, గగ్గుపల్లి అధ్యక్షుడు జాన్సన్, ఆలూరు ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొత్తూరు సునీల్, ఎస్ఎంసి చైర్మన్ గంగారెడ్డి, సీనియర్ నాయకులు సి బి సురేష్, ఆలూరు మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్క ఓటరుకు అవగాహన కల్పించాలి

- తహసీల్దార్ ఆంజనేయులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



బహుమతులు అందజేస్తున్న ఎంపీడీవో

మండలంలోని స్వయం సహాయక బృందాలు, ఐకెపి సిబ్బంది ప్రతి ఒక్క సంఘ సభ్యురాలికి వారి ద్వారా ప్రజలకు ఓటు హక్కు వినియోగంపై సంపూర్ణ అవగాహన కల్పించాలని తహసిల్దార్ ఆంజనేయులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా ముగ్గుల పోటీలు, మెహేంది పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల నుంచి మహిళా సమాఖ్య ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు. తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని దేశ అభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలని సూచిస్తూ రంగురంగుల రంగవల్లులను వేశారు. ప్రతి ఒక్క ఓటరు విధిగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎంపీడీవో పేర్కొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఏపిఎం కుంట గంగాధర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు రోజా రాణి, సీసీలు రవికుమార్, శ్రీనివాస్, నవీన్, భాగ్యలక్ష్మి, పీరియ, అలేఖ్య మహిళలు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ, జీపీ తనిఖీ



కంపోస్ట్ షెడ్డును పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని పిప్రి గ్రామం పల్లే ప్రకృతి వనం, నర్సరీ, గ్రామపంచాయతీని ఆర్మూర్ డివిజనల్ పంచాయతీ అధికారి శివకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. మండల పరిషత్‌లో పన్నులు వసూలు, తాగునీటి గురించి పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఎంపీడీవో సంతోష్ కుమార్, ఎంపిఓ మోహన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షల ప్యాడ్స్ పంపిణీ

నవతెలంగాణ-మోర్తాడ్

మండలం పాలెం జడ్పీహెచ్ఎస్ స్కూల్లో ఎన్ఎస్‌సిఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ గురువారం పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు నీరజ్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్స్ పంపిణీ చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల మైనార్టీ కాంగ్రెస్ నాయకుడు ఇంతియాజ్, బ్రహ్మ నాయుడు, నరేష్, గంగారాం, సాయిన్న తదితరులు పాల్గొన్నారు.

స్టోర్ రూమ్ ఆలయ కమిటీకి అప్పగింత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కేశ్ పల్లి గ్రామంలో శుక్రవారం దేవి ఆలయం వద్ద మాజీ సర్పంచ్ మైదాం మహేశ్వర్ కుటుంబ సభ్యులు స్టోర్ రూమ్ నిర్మించి ఆలయ కమిటీ సభ్యులకు గురువారం అందజేసినట్టు మాజీ సర్పంచ్ మైదం మహేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ వస్తు సామాగ్రి ఉంచేందుకు మైదం క్రాంతి తండ్రి మహేశ్వర్ దాదాపు లక్షా 50వేలతో గది నిర్మించి గురువారం ఆలయ కమిటీ సభ్యులకు అప్పగించినట్లు తెలియజేశారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



బహుమతులు అందుకుంటున్న మహిళలు

మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయ ఆవరణలో ఓటర్ దినోత్సవ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీల కార్యక్రమాలను నిర్వహించినట్లు ఏపీఎం రవీందర్ రెడ్డి గురువారం తెలిపారు. ముగ్గులు, మెహెందీ పోటీలను నిర్వహించి ప్రథమ ద్వితీయ బహుమతులను అందజేయడం జరిగిందని గురువారం తెలిపారు.

రాజకీయంలో మహిళ ప్రాతినిధ్యం పెరిగినప్పుడే మహిళా సాధికారత

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

రాజకీయంలో మహిళ ప్రాతినిధ్యం పెరిగినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉమెన్ (ఎన్ఎఫ్ఐడబ్ల్యు)జిల్లా కార్యదర్శి మంద స్వరూపరాణి అన్నారు. మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సిపిఐ కార్యాలయంలో మహిళలు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో మహిళలు తమ ప్రతిభను చాటుకుంటున్నారని అన్నారు. దేశంలో బిజెపి అధికారంలో వచ్చిన తర్వాత మహిళలపై హింస, అణచివేత, అత్యాచారాలు పెరుగుతున్నాయని, సామ్రాజ్యవాద విషసంస్కృతిని ప్రోత్సహిస్తూ దేశంలో సాంప్రదాయాలను మట్టిలో కలుపుతున్నారని అన్నారు. ఇప్పటికైనా రాజకీయపక్షాలన్నీ పార్లమెంట్ ఎన్నికల్లో 33శాతం మహిళలకు రిజర్వేషన్లు కల్పించినప్పుడే మహిళ సాధికారత సాధించగలుగుతామని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యు నాయకులు పవిత్ర, పి కవిత, ఎం స్వరూప, యు భారతి, భాగ్య, అనిత, రమా తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ
మైనార్టీ అధ్యక్షులు జైనోద్దీన్‌పై దాడిని ఖండిస్తున్నాం

- మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-ఏర్గట్ల



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మండల బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ అధ్యక్షుడు జైనోద్దీన్ పై కాంగ్రెస్ మండల మైనార్టీ నాయకుడు, ఆయన అనుచరులు దాడిచేయాడాన్ని మండల బీఆర్ఎస్ పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ మండలాధ్యక్షుడు పూర్ణానందం, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, ఎంపీపీ ఉపేంధర్ రెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పూర్ణానందం మాట్లాడుతూ... జైనోద్దీన్ అనే వ్యక్తిపై మండల మైనార్టీ నాయకుడు ఆయనని అనుచరులు కర్రలతో దాడిచేయడం హేయమైన చర్య అని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది కదా అని ఇష్టానుసారంగా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై దాడులు చేస్తే సహించబోమని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ 10 సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు ఏనాడు ఇలాంటి దాడులకు పాల్పడలేదని, ఇది కక్ష పూరిత చర్య అని అన్నారు. దాడుల వెనుక ఎవరున్నారనేది పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. అనంతరం జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్ మాట్లాడుతూ... బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సునీల్ రెడ్డి అనుచరులు జైనోద్దీన్ పై చేసిన దాడిని ఖండిస్తున్నాం అని, పచ్చని ఏర్గట్లలో ఇంత వీరంగం నా.. 45 సంవత్సరాల కాలంలో ఎన్నడూ చూడలేదని అన్నారు. అధికారం శాశ్వతం కాదని, అధికారం ఉంటే ప్రజా సమస్యలు పరిష్కరించాలని, ఈ దాడులు ఏంటని హెచ్చరించారు. నడి ఊళ్ళో కర్రలు పట్టుకుని దాడులు చేయడం దేనికి సంకేతం అన్నారు. ఈదాడులో ప్రాణాలు పోతే ఆయన కుటుంబం గతి ఏంటని ప్రశ్నించారు. సమావేశంలో ఎంపీటీసీ జక్కని మధు సూధన్,బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బద్దం శ్రీనివాస్ రెడ్డి,నాయకులు రొక్కెడ మోహన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

దాడిచేసిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామనిఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. దర్యాప్తు చేపట్టామని, నిజానిజాలు నిగ్గు తేల్చాక కేసు పూర్వపరాలు వెల్లడిస్తామని అన్నారు.పాత కక్షలతో ఈ దాడి జరిగినట్టు తెలుస్తుందని అన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల 3నెలల వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల 3నెలల బకాయి వేతనాలు చెల్లించాలని కలెక్టర్ కార్యాలయంవద్ద గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నేషనల్ హెల్త్ మిషన్లో (ఎన్ హెచ్ ఎం)పనిచేస్తున్న వివిధ కేడర్ల ఉద్యోగులు, రెండవ ఏ ఎన్ ఎం లతో ధర్నా నిర్వహించి ఏఓకి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో గ్రామీణ స్థాయిలో ప్రజలకు ఆరోగ్యపరమైన సేవలు అందిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేల్లో క్యాంపులు నిర్వహిస్తూ ప్రభుత్వం స్కీములను విజయవంతం చేస్తున్న నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. వేతనాలపైనే ఆధార పడ్డటువంటి కార్మికులు మూడు నెలలుగా అవస్థలు పడుతుంటే ప్రభుత్వం స్పందించి పెండింగ్ వేతనాలు చెల్లించడంతోపాటు గత పిఆర్సి బకాయిలను కూడా చెల్లించాలని వీరందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే సమ్మె కైనా సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పి నర్సింగరావు యూనియన్ జిల్లా అధ్యక్షురాలు భాగ్యమ్మ, మంజుల, సరిత, మహేష్, కళావతి ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

బిజెపి అక్రమ విరాళాల వివరాలు చెప్పాలి

- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్



ధర్నాలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు అన్ని పార్టీల యొక్క ఎలక్ట్రికల్ బాండ్ పథకం యొక్క వివరాలను వెల్లడించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెప్పిన బీజేపీ యొక్క అక్రమ లావాదేవీలను బయట పెట్టనందుకు నిరసనగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చౌరస్తా వద్ద గల ఎస్బిఐ బ్రాంచ్ ముందు నిరసన గురువారం తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశ వేణు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ... 2017 నుండి రాజకీయ పార్టీలు తీసుకున్న ఎలక్ట్రికల్ బాండ్ (విరాళాలు) వివరాలను బహిర్గతం చేయాలని ఎలక్షన్ కమిషన్ కు 6 మార్చి వరకు అప్పగించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు సుప్రీంకోర్టు తెలియజేసినప్పటికీ ఇంకా అందించలేదని అన్నారు. క్షణాల్లోనే లావాదేవీలు బయటికి వచ్చే టెక్నాలజీ ఉన్న కూడా కేవలం బిజెపితో తమకు ఉన్న చీకటి ఒప్పందం కారణంగానే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బిజెపి యొక్క విరాళాల వివరాలను బహిర్గతం చేయలేక పోతుందని తెలిపారు. బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ వ్యాపారులకు తొత్తుగా మారి వారి నుండి కోట్ల రూపాయల నల్లధనం విరాళాల పేరుతో తమ ఖాతాలో జమ చేసుకుందని మానాల మోహన్ రెడ్డి విమర్శించారు. బండారం బయటపడుతుందని భయంతో మోడీ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పై ఒత్తిడి తెచ్చి వారి వివరాలు బయటకు రాకుండా చూస్తున్నాడని తెలిపారు. 2017 నుండి బిజెపి యొక్క ఎలక్ట్రికల్ బాండ్ (అక్రమ విరాళాల) యొక్క వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత మాట్లాడుతూ బిజెపి పార్టీ ఎలక్ట్రికల్ బాండ్ పేరుతో కార్పొరేట్ కంపెనీల నుండి అక్రమ సంపాదనను విరాళంగా తీసుకుందని, ఎస్బిఐ బిజెపి కలిసి చీకటి ఒప్పందం నడుపుతున్నాయని ఆమె విమర్శించారు. ఈ సందర్భంగా నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశ వేణు మాట్లాడుతూ..

బిజెపి మరియు ఎస్బిఐ చీకటి ఒప్పందం వివరాలను వెంటనే బహిర్గతం చేయాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, పిసిసి మాజీ కార్యదర్శి రాంభూపాల్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విక్కీ యాదవ్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు వేణు రాజ్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సంతోష్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగం, జిల్లా ఓబీసీ అధ్యక్షులు నరేందర్ గౌడ్,జి ల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు యాదగిరి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శేఖర్, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్

ఉన్నతవిద్య అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం భారత విద్యార్థి ఫెడరేషన్ నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వ ర్యంలో ఈనెల 9, 10వ తేదీల్లో తెలంగాణ యూనివర్సిటీలో జరిగే రాష్ట్ర యూనివర్సిటీల కన్వెన్షన్ సందర్భంగా ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ఉన్నత విద్యారంగం ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశం పైన ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ నగర కార్యదర్శి పోష మైన మహేష్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐటిఐ రిటైర్డ్ ప్రిన్సిపల్ రామ్మోహన్‌రావు పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ విద్యారంగ పరిస్థితి పై సూచనలు, సలహాలు తెలిపారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బోడ అనిల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 9,10వ తేదీల్లో రాష్ట్ర యూనివర్సిటీల కన్వెన్షన్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కన్వెన్షన్ సందర్భంగా విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం కార్యాచరణ రూపొందించుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన పిడిఎస్యు, ఏఐఎస్ఎఫ్, పిడిఎస్‌యూ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో యూనివర్సిటీలో టీచింగ్, నాన్ టీచింగ్ ఫ్యాకల్టీ కొరత ఉందని, మౌలిక సదుపాయాల కల్పన లేదని అన్నారు. అలాగే కొన్ని యూనివర్సిటిల్లో కనీసం వీసీ కూడా లేకుండా పాలన వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారయిందని తెలిపారు. ఇలాంటి సమస్యల పరిష్కారం కొరకు భవిష్యత్తులో కలిసికట్టుగా ముందుకు వస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురాం, పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్కే గణేష్, పిడిఎస్‌యూ ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, ఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు దీపిక, వేణు ఎస్ఎఫ్ఐ హాస్టల్ కమిటీ నాయకులు శ్రీహరి పిడిఎస్యు జిల్లా సహాయ కార్యదర్శి ప్రిన్స్ తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలను చెల్లించండి

- యూనియన్ జిల్లా అధ్యక్షులు షాదుల్లా డిమాండ్



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఎంప్లాయిస్ ఎన్ హెచ్ ఎం అండ్ ఎం ఎల్ హెచ్ పి బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని యూనియన్ జిల్లా అధ్యక్షులు షాదుల్లా డిమాండ్ చేశారు. గురువారం సిఐటియు ఆధ్వర్యంలో ఎన్‌హెచ్‌ఎంఅండ్‌ఎంఎల్‌హెచ్‌పి పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు డీఎంహెచ్ఓకు బకాయి వేతనాలు ఇవ్వాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు షాదుల్లా మాట్లాడుతూ..నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలోని యుపీహెచ్సీ, హెచ్సీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ పారామెడికల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని చాలా కాలంగా ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తున్నామని తెలిపారు. ఎనోచ్‌ఎంలో సుమారు 17 వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారుని, వీరిలో అత్యధికులకు రాష్ట్ర ప్రభుత్వం పిఆర్సి ప్రకారం జీతభత్యాలు చెల్లించడం లేదని అన్నారు. గతంలో జీఓ నెం.510 ద్వారా సుమారు 10 వేల మంది వరకు డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్టులు, ఏఎన్ఎం తదితరులకు బేసిక్ ప్రకారం వేతనాలు నిర్ణయించి చెల్లిస్తున్నారని తెలిపారు. ఇందులో కొన్ని కేటగిరీలకు పర్మినెంట్ ఎంప్లాయీ బేసిక్ కన్నా తక్కువ చెల్లిస్తున్నారని, మిగిలిన సుమారు 7 వేల మందికి కనీస బేసిక్ కాకుండా అతి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని అన్నారు. వీరందరికీ కనీస వేతనం, డిఎ, హెచ్ఆర్ఎ తదితర అలవెన్సులు నిర్ణయించి అమలు చేయాలన్నారు. తక్కువ వేతనాలు పొందుతున్న వారందరికీ వైద్య, ఆరోగ్య శాఖలోని పర్మినెంట్ ఉద్యోగుల యొక్క బేసిక్, అలవెన్సులు నిర్ణయించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ భాషిత పాఠశాలకు కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ లండన్ వారి ప్రశంసలు



సత్కరించి మెమోంటో అందజేస్తున్న పాఠశాల యాజమాన్యం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని శ్రీ భాషిత పాఠశాలకు కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ లండన్ వారి ప్రశంసలు లభించినట్లు చైర్మన్, కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ గురువారం తెలిపారు. కేంబ్రిడ్జ్ ప్రెస్ లండన్ అసిస్టెంట్ మేనేజర్ స్టేట్ హెడ్ అండ్ ఏరియా ఇంచార్జ్ శ్వేత, తెలంగాణ స్టేట్ హెడ్ పి. గోపాల్ రెడ్డి- ఏరియా ఇంచార్జ్ సేల్స్ ఆఫీసర్ ప్రశాంత్ పాఠశాలను సందర్శించి ఆరవ తరగతి ఏడవ తరగతి పాఠ్య పుస్తకాల విద్యా ప్రామాణికతను, శ్రీ భాషిత పాఠశాలలో నిర్వహించే వివిధ విద్య విషయక కృత్యాలను ప్రశంసించారన్నారు. మంచి నాణ్యతతో ఉత్తమ విద్యా ప్రమాణాలతో బోధిస్తున్న శ్రీ భాషిత పాఠశాల ప్రయోజనాలను విద్యార్థుల తల్లిదండ్రులు అందిపుచుకోవాలని పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా శ్రీ భాషిత పాఠశాల యాజమాన్యం కేంబ్రిడ్జ్ ప్రెస్ లండన్ వారిని సత్కరించినట్టు తెలిపారు.

ప్రజా పాలన సేవ కేంద్రం ఏర్పాటు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ప్రజా పాలన సేవ కేంద్రం ఏర్పాటు చేశారని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి అకుల రవీందర్ సూచించారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజలు ప్రజా పాలనకు సంబంధించి మహలక్ష్మి గ్యాస్ సిలిండర్ సబ్సిడి, గృహ జ్యోతి స్కీం కోసం దరఖస్తూ చేసుకోవాలని తెలిపారు. ఈ దరఖాస్తు కోసం ప్రజలు రేషన్ కార్డు, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డ్స్, కరెంటు బిల్, గ్యాస్ బుక్, గ్యాస్ బిల్ కూడా తీసుకురావాలని వివరించారు. ఇప్పటి వరకు 335 దరఖాస్తు వచ్చాయని, అందులో 175 గృహ జ్యోతి, 119 గ్యాస్ సిలిండర్ సబ్సిడి వచ్చాయని, దానిలో 40 దరఖాస్తు పెండింగ్లో ఉన్నాయని పేర్కొన్నారు.

రాష్ట్ర మంత్రిని కలిసిన నియోజకవర్గ నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి నీ గురువారం నియోజకవర్గ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి బాల్కొండ ఇన్చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా వినయ్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని నందిపెట్, డొంకేశ్వర్ మండలాల లోని గ్రామాలు నిఖలపూర్, మారంపల్లి, తల్వేద, వన్నెల్-కె గ్రామాలకు పంపులు, మోటార్లు, ప్యానెల్ బోర్డుల మరమ్మతులకు 4.83 కోట్లకు మంజూరు చేయాలని కోరారు. దీనికి మంత్రి స్పందించి నిధులు విడుదల చేస్తానని హామీనిచ్చారు. ఈ నిధుల మంజూరు వల్ల 14,056 ఎకరాలు ఆయకట్టు రైతులకు లబ్ది జరుగుతుందని తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందంజ



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మహిళలు అన్ని రంగాల ముందుకు వెళుతున్నారని ప్రముఖ పారిశ్రామిక వేత్త నల్లా జయరెడ్డి అన్నారు. నగరంలోని కంఠేశ్వర్‌లో గల మహిళా కళాశాలలో గురువారం మహిళా దినోత్సవాన్ని చాలా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ పారిశ్రామిక వేత్త నల్లా జయరెడ్డి హాజరై మాట్లాడుతూ... మహిళలు చదువునే ఆయుధంగా చేసుకొని ధైర్యంగా ముందుకు వెళ్ళాలని అన్నారు. రాజేంధర్ రెడ్డి మాట్లాడుతూ.. చదువు ప్రాముఖ్యతను గొప్పతనం తెలుసుకోవాలని, చదువుకుంటే దేన్నైనా సాధించగలరని అన్నారు. విద్యార్థులకు స్ఫూర్తి దాయకమైన ఉపన్యాసాన్ని అందించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కిషన్ రెడ్డి, మేనేజ్మెంట్ మెంబర్ అనిత రెడ్డి, ప్రిన్సిపల్ భాతి రెడ్డి, టీచింగ్, నాన్టిటింగ్ స్టాఫ్ పాల్గన్నారు.

యువత ప్రలోభాలకులోనై ఇబ్బంది పడొద్దు



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

యువత ప్రలోభాలకులోనై జీవితాన్ని ఇబ్బందులపాల చేసుకోవద్దని16 వ డివిజన్ కార్పొరేటర్ పంచరెడ్డి ప్రవల్లిక శ్రీధర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నవ తెలంగాణ తెలుగు దినపత్రికతో మాట్లాడుతూ.. మనుషుల వ్యక్తిత్వం, మనస్తత్వాన్ని ముందుగానే తెలుసుకొని దూరంగా ఉండాలని అన్నారు. నిజామాబాద్ నగరంలో ఎక్కడపడితే అక్కడ ప్రైవేటు గర్ల్స్, మహిళా హాస్టల్ ఏర్పాటు చేస్తున్నారు. వాటిపైన కచ్చితంగా ప్రభుత్వం అధికారులు అబ్జర్వేషన్ ఎప్పుడు ఉండాలి. దాంతో హాస్టల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా, హాస్టల్లో ఉన్నవారికి రక్షణ కలుగుతుందని అన్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సును కల్పించడంతో, మహిళలు అవసరం ఉన్న, లేకపోయినా బస్సులలో ప్రయాణించడంతో అవసరం ఉండి వెళ్లే మహిళలకు ఇబ్బంది కరంగా మారుతుందని అన్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు నే కాకుండా, మహిళలకు ప్రత్యేకంగా ఎంతో కొంత బస్ టికెట్ తీసుకునే విధంగా ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. ఉచితబస్ ప్రయాణంతో అవసరం ఉన్న మహిళలకు కూడా కనీసం కూర్చోవడానికి స్థలం దొరకని పరిస్థితి ఏర్పడిందని అన్నారు.

పిల్లల సంరక్షణలో మహిళల పాత్ర ఎంతో గొప్పది



- సిడిపిఓ భార్గవి

నవతెలంగాణ-ఆర్మూర్

పిల్లల సంరక్షణలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని, అవకాశాలను అందరికీ సమంగా అందివ్వాలి అని అంగన్వాడి ప్రాజెక్టు సిడిపిఓ భార్గవి గురువారం తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె నవ తెలంగాణతో మాట్లాడుతూ.. మహిళలకు విద్య, వైద్యం, ఆర్థిక వనరులకు సమానంగా ప్రోత్సహించే విధానాలను అమలు చేసే విధంగా ప్రోత్సాహాన్ని ఇవ్వాలి. ఇప్పటికీ చాలా చోట్ల లింగ ఆధారిత వేతన అంతరాన్ని ఎదుర్కొంటున్నారు. పిల్లల సంరక్షణలో మహిళల ప్రాముఖ్యత అత్యంత ముఖ్యమైందని.. కానీ కొద్ది మంది మహిళలు ఇప్పటికీ ఉద్యోగం చేస్తున్న ప్రదేశాల్లో వివక్షను ఎదుర్కొంటున్నారు. ఇంకా పెద్ద మొత్తంలో మహిళలకు ఆర్థిక అక్షరాస్యతను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వ్యాపార అవకాశాలు పెంచాలి అన్ని స్థాయిలలో లింగ ఆధారిత వైవిధ్యం ఉంది. అలాగే వ్యాపారాల్లో కూడా మహిళలను రెండవ శ్రేణి వారీగా గుర్తిస్తున్నారు. కొంచెం కొంచెం ఇప్పుడిప్పుడే మార్పు వస్తుంది. కానీ ఇంకా పరిపూర్ణం కాలేదు. మహిళలను వ్యాపారాల్లో రాణించేలా ప్రోత్సహించాలి. అని, లింగ అధారంగా కాకుండా వారి అభిరుచిని బట్టి వ్యాపారాల్లో అవకాశాలు అందివ్వాలి. సమాన పనికి సమాన వేతనాన్ని అందించాలి. మహిళలకు పని చేసే ప్రదేశాల్లో మద్దతు ఇచ్చే పని వాతావరణాన్ని సృష్టించాలి.

మహిళల సాధికారత కోసం కృషి అవసరం

అందరూ మహిళా యజమాన్య సంస్థలకు మద్దతు ఇవ్వాలి. యువతులకు మార్గదర్శకులుగా ఉండాలి. ఆర్థిక సమానత్వాన్ని ప్రోత్సహించే విధానాలకు మద్దతు ఇవ్వవలసిన అవసరం ఎంతైనా ఉంది. మహిళల్లో పెట్టుబడి అంటే వారికి చేయూత ఇవ్వడం కాదు.. అది వారి అపారమైన సామర్థ్యాన్ని బయటకు తీయడం. ప్రతి ఒక్కరూ తమ సొంత ఆర్థిక విజయానికి, సానుకూల సామాజిక మార్పుకు కారణమవుతూ, భవిష్యత్తును నిర్మించేలా వారిని సాధికారపరచడం. అంతరాలను అధిగమించి, అందరూ కలిసి పురోగతిని వేగవంతం చేయాలి.

సాంకేతికత ద్వారా మహిళ సాధికారత..

ప్రస్తుత డిజిటల్ యుగంలో అంతరాన్ని అధిగమించాలి. ఆధునిక కార్మిక శక్తికి కీలకమైన డిజిటల్ నైపుణ్యాలను అందించడానికి మహిళలకు టెక్నాలజీని అందించి డిజిటల్ అక్షరాస్యతలో ఉన్న అంతరాన్ని తగ్గించాలి. ఇప్పటికీ చాలా వరకు మహిళల్లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం లేమితో ఇబ్బంది పడుతున్నారు. కావున అంతరాన్ని తగ్గించే ప్రయత్నం చేయాలి. పురుష పక్షపాతాన్ని మహిళ వివక్షతలను విచ్ఛిన్నం చేయాలి. అచేతన పక్షపాతాన్ని సవాలు చేసి, మహిళల ఆర్థిక అవకాశాలను అడ్డుకుంటున్న మూస పద్ధతులను తొలగించే విధానాలు, పద్ధతులను ప్రోత్సహించాలి. విశిష్ట ప్రతిభ గల మహిళల విజయాలను గుర్తించాలి, అందరికీ తెలియచేయాలి. విజయవంతమైన మహిళలను, మహిళ పారిశ్రామికవేత్తలను మహిళ నాయకులను గుర్తించి వారు వారి వారి రంగాల్లో ప్రదర్శించిన విశేష ఖ్యాతి నీ గుర్తించి ప్రస్తుత తరం వారికి వారి ఎదుగుదలను, వారి విశిష్టతను, వారు ఎదుర్కొన్న అటుపోట్లను తెలియచేయాలి.ఆర్థిక ఆకాంక్షలను నెరవేర్చడానికి స్ఫూర్తినిచ్చేలా విజయవంతమైన మహిళల, మహిళా పారిశ్రామికవేత్తలు నాయకులను స్ఫూర్తి పొందే విధంగా ఉండాలి. ప్రభుత్వాలు, ప్రైవేటు రంగం, స్వచంద సంస్థలు వివిధ రంగాల్లో నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాలను అందించడం ద్వారా మహిళలకు ఉద్యోగ అవకాశాలను ఇవ్వాలి. మహిళలను కుటుంబ సభ్యులు ప్రోత్సహించాలి. ఇంటి పనులు, పిల్లల సంరక్షణ బాధ్యతలను పంచుకోవడం ద్వారా మహిళలు వారి వృత్తిపరమైన లక్ష్యాలను సాధించడానికి కుటుంబ సభ్యుల నుండి మద్దతును ప్రోత్సహించాలి. ఈ చర్యల ద్వారా మహిళల్లో వారి సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవడం ద్వారా, సమాన న్యాయమైన సమాజ పునర్నిర్మాణంలో అందరం భాగం కావచ్చని అన్నారు.

రాణిస్తున్న మహిళామణులు

- మహిళా సంఘాల ప్రోత్సాహంతో ఆర్థిక ఎదుగుదల



నవతెలంగాణ-వర్ని

మండల జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ టిసెర్ప్ ఆర్థిక సహాయంతో పచ్చళ్ళు, పిండి వంటలు చేస్తూ తమ కుటుంబానికి ఆర్థిక తోడ్పడుతోంది ఉండవల్లి దివ్య. వాటిని పలు ప్రాంతాలకు రవాణా చేస్తూ ముందుకు సాగుతుంది.

పద్మ రాజ్ మహిళా సంఘంలో చేరకముందు వారికి ఉన్న రెండు ఎకరాల సాగుభూమిను వరి పంటను వేస్తూ జీవనం సాగించేవారు. మహిళా సంఘం తెలుగు తల్లి మహిళా పొదుపు సంఘంలో సభ్యురాలుగా చేరింది. 1999లో ఆమె మహిళా సంఘం లో సభ్యురాలు చేరి నేడు పచ్చళ్ళు పిండి వంటలు తయారు చేస్తూ ఇతర ప్రాంతాలకు సరఫరా చేయటంలో పేరుగాంచింది. గృహానికి పరిమితం కాకుండా భర్తకు అండగా ఉంటూ రెండు ఎకరాల పొలం సాగుతో పాటు మహిళా సంఘం ద్వారా ఉపాధి కల్పించుకొని పచ్చళ్ళు పిండి వంటలు చేయడంలో ఆమెకంటూ గుర్తింపును పొందింది. వీటితో నెలకు రూ.29 వేలు ఆదాయం సంపాదిస్తుంది.

సంగం ఆర్థిక సాయంతో విదేశాల్లో పిల్లల చదువులు..

మండల కేంద్రంలోని ఎస్ఎన్‌పురం గ్రామ పంచాయతీ పరిధిలో గల మండల సమైక్య ఆధ్వర్యంలో 2021లో కిలారీ శ్యామల చలపతిరావు దంపతులు వారికి ఉన్న ఒక గేదెతో పాలు అమ్ముకొని జీవనం కొనసాగించేవారు. కిలరి శ్యామల పవిత్ర మహిళా పొదుపు సంఘంలో సభ్యురాలుగా చేరి కొంచెం కొంచెంగా పొదుపు సంఘంలో డబ్బును తీసుకొని అదే గ్రామంలో టైలరింగ్, డైరీ ఫార్మ్ పప్పు గిర్నిని ఏర్పాటు చేసుకొని రోజువారీగా ఆదాయమును సంపాదించుకోవడం మొదలు చేసింది. అనంతరం ఆమె ఏర్పాటు చేసుకున్న వ్యాపారాలు లాభాల బాటలో ఉండటంతో కుటుంబం ఆర్థికంగా ఎదిగింది.

కీలక రంగాలలో మహిళలే ముందున్నారు

- అంగన్వాడి ప్రాజెక్టు అధ్యక్షురాలు పి.చంద్రకళ



నవతెలంగాణ-ఆర్మూర్

నేడు కీలక రంగాల్లో మహిళలే ముందున్నారని, పురుషులతో సమానంగా మహిళలకు అవకాశాలు కల్పిస్తే అంతరిక్షం కూడా చేరుతారని అంగన్వాడి ప్రాజెక్ట్ అధ్యక్షురాలు పి చంద్రకళ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ఇంటర్వ్యూ..

అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురించి ఏమంటారు?

ఆకాశంలో సగం.. అవకాశాల్లో సగం.. ఇలా అన్నిటిలో సగమై సమాజంలో నిలదొక్కుకుంటున్న ఎందరో మహిళ మూర్తులు నేడు ఆదర్శంగా నిలుస్తున్నారు. మహిళల ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలుస్తూ చరిత్రలో మహిళలకు ఒక రోజు జరుపుకునే పండగ ఈ మహిళా దినోత్సవం..

మహిళల అభివృద్ధిపై కుటుంబ సభ్యుల పాత్ర?

నేడు మహిళలు ప్రతినిత్యం అటు ఇంట్లో, ఇటు బయట అనేక విధులు నిర్వహిస్తున్నారు. ఆఫీసుల్లోనూ ఇంట్లోనూ మహిళలు ఎక్కడ పనిలో భారం అని భావించకుండా సమతుల్యలతో పనులు నిర్వహిస్తూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించటం లేదు. దీంతో అనేక శారీరక రుగ్మతలు తలెత్తుతున్నాయి. మహిళల అభివృద్ధికి కుటుంబ సభ్యులు ఎల్లవేళలా సహకరించాలి.

విద్యాబోధనపై మహిళలకు మీరిచ్చే సలహాలు?

చిన్ననాటి నుండే ఆడ,, మగ అని భేదాభవం పెట్టుకోకుండా చదివించాలి. మహిళలు ఏ రంగంలోనైనా రాణించాలంటే ముఖ్యంగా విద్య నేర్చుకోవడం చాలా ముఖ్యం. విద్యావంతురాలు అయినప్పుడే కుటుంబం, సమాజం అభివృద్ధి పదంలో ఉంటుంది.

కుటుంబాన్ని చూస్తూ... రాజకీయంలో రాణిస్తూ..

- మండలంలో అనేక అభివృద్ధి పనులు
- అన్నింటా ముందుంటున్న గుండారం జడ్పిటిసి సుమలత



నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

నిజామాబాద్ రూరల్ మండలంలోని గుండారం జడ్పిటిసి సుమలత గుండారం జడ్పిటిసిగా పోటీ చేసి బాజిరెడ్డి సహకారంతో బారీ మెజార్టీతో గెలిచిన విషయం అందరికీ తెలిసిందే. తన భర్త విదేశాల్లో ఉన్నప్పటికీ ఇద్దరు పిల్లలను చూసుకుంటూ జడ్పిటిసిగా రాజకీయంలో రాణించింది. భర్త వచ్చిన తర్వాత ఆయన కలిసి ఇంకా రాజకీయంలో దూసుకెళ్లింది. తెలంగాణ ఆర్టీసీ మాజీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి సహాయ సహకారంతో నిజామాబాద్ రూరల్ మండలంలో ఉన్న 20 గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టింది. సిసి రోడ్లు, అండర్ డ్రైనేజీలు, హైమాక్స్ లైట్లు, చెరువు పూడికకలు తీయడం, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం, రైతుబంధు, సీఎం రిలీఫ్ ఫండ్, వృద్ధాప్య పెన్షన్లు, కల్యాణ లక్ష్మి ఇప్పిస్తూ పేదలను ఆదుకుంటోంది. జలాల్పూర్‌లో మూడు లక్షలతో సిసి రోడ్డు గుండారంలో 20 లక్షల రూపాయలతో సిసి రోడ్లు అశోక్ ఫారంలో 3 లక్షలతో డ్రైనేజీ, ఖానాపూర్లో 4.5 లక్షలతో డ్రైనేజీ, మల్కాపూర్‌లో ఆలయానికి వెళ్లే దారిలో ఐదు లక్ష రూపాయతో రోడ్డు, రాంనగర్‌లో మూడు లక్షల రూపాయలతో రోడ్డు పనులు చేపట్మాన్నారు. మల్కాపూర్‌లో హైమాక్స్ లైట్స్ జలాల్పూర్‌లో గుడిదగ్గర, పాల్డ, తీర్మన్‌పల్లి దగ్గర హైమాక్స్ లైట్, ధర్మారం, గాంధీనగర్, ముత్తకుంట, గాంధీ నగర్, శాస్త్రినగర్ గ్రామాల్లో పనులకు ప్రొసీడింగ్స్ వచ్చాయి. త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ధర్మారంలో బోరు తిర్మన్‌పల్లిలో 2 లక్ష రూపాయలతో డ్రైనేజీ పనులు, ఐమాక్స్ లైట్ ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు. బాజిరెడ్డి గోవర్ధన్ సహకారంతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తెలిపారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

- సెయింట్‌పాల్ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ కాథరిన్‌పాల్



నవతెలంగాణ-ఆర్మూర్

మహిళలు దేశానికి దిక్సూచి, మహిళలకు చట్టాలపై అవగాహన తప్పకుండా ఉండాల్సిన అవసరం ఉందని పట్టణంలోని మామిడిపల్లి సెయింట్ పాల్ విద్యా సంస్థల ప్రిన్సిపాల్ కాథరిన్ పాల్ తెలిపారు. మహిళలు ఏ రంగంలోనైనా రాణించాలంటే విద్య నేర్చుకోవడమే చాలా ముఖ్యమని అన్నారు. మహిళలు విద్యావంతురాలు అయితేనే కుటుంబం, సమాజం అభివృద్ధి పథంలో ఉంటుంది. సరోజిని నాయుడు, కిరణ్ బేడీ, జ్యోతిబాపూలే వివిధ రంగాల్లో రాణిస్తున్న వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలి. చదువు ద్వారా రాబోయే తరాలను ఉన్నతంగా తీర్చిదిద్దవచ్చు. సమాజం ప్రోత్సహిస్తే మహిళలు అనేక విజయాలు సాధించగలరు.

విద్యార్థి దశ నుంచే హక్కులపై అవగాహన కల్పించాలి

- జిల్లా పట్టణ, గ్రామీణ ప్రణాళిక అధికారి ఎకుల భార్గవి



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యార్థి దశ నుండే మహిళలకు అవగాహన కల్పించాలని తద్వారనే జీవితంలో ముందుకు కొనసాగే అవకాశాలు ఉంటాయని జిల్లా పట్టణ, గ్రామీణ ప్రణాళిక అధికారి ఎకుల భార్గవి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా నవతెలంగాణ దినపత్రికతో మాట్లాడుతూ విద్యార్థి దశలోనే మహిళలకు ఉండే హక్కులు, సమాజంలో ఏ విధంగా ముందుకు వెళ్లాలని అవగాహన కల్పిస్తూ, పుస్తక పరిజ్ఞానంతో పాటు మానసికంగా దృఢంగా ఉండే విధంగా విద్యార్థి దశలోనే ఉపాధ్యాయులే సూచించాలి. విద్యార్థి దశలోనే ఆటలు ఆడడంతో మనోధైర్యం, శారీరక దృఢత్వం ఏర్పడుతుంది. శారీరక దృఢత్వాన్ని ఆటలు మెరుగు పరుస్తాయి. కొన్నింటికి ప్రభుత్వమే కచ్చితమైన, నిర్ణయాలు, నిబంధనలను ఏర్పాటు చేయాలి. స్కూల్ లైఫ్, కాలేజ్ లైఫ్ లోనే విద్యార్థులు ఎక్కువ సమయాన్ని కేటాయిస్తారు. కనుక విద్యా సంస్థలలోనే, విద్యార్థి దశలోనే హక్కులపై అవగాహన కల్పించడంతోనే తరువాత జీవితంలోను చాలా ఉపయోగపడుతుంది.

ఘనంగా మహిళా దినోత్సవం

నవతెలంగాణ-విలేకరులు

నవీపేట్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని నవోదయ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను శాలువాలతో గురువారం సన్మానించారు. కుటుంబంతో పాటు సమాజాభివృద్ధిలో మహిళల ప్రాధాన్యత చాలా గొప్పదని ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో నవోదయ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ రెడ్డి, లిటిల్ ఫ్లవర్ పాఠశాల కరస్పాండెంట్ హన్మాన్లు, ఉపాధ్యాయులు అంబర్ సింగ్, రహీముద్దీన్ మరియు మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆక్రాన్‌పల్లి : మండలంలోని తొర్లికొండ గ్రామంలో ఎస్బిఐ బ్యాంకులో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థల్లో పనిచేస్తున్న విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లను లను బ్యాంకు మేనేజర్ శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఐకెపి కమ్యూనిటీ కోఆర్డినేటర్ రవి బ్యాంకు సిబ్బంది తోర్లి కొండ బ్రాహ్మణపల్లి గ్రామాల వివోఏలు పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మార్చ్ 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లో మహిళలు సాధించిన విజయాలను ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులు లక్ష్మీ ప్రసన్న, అనితను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలయ్య, ఉపాధ్యాయులు పి.గణేష్, ఈ.గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : మండల కేంద్రంలోని మిసిమి ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న మహిళా టీచర్స్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ బాలి రవీందర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మహిళల చదువు దేశానికి ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. సమాజంలో మహిళల సమాన హక్కులు కాపాడాలన్నారు. మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, వారికి పురుషుల నుండి అన్ని రకాలుగా ప్రోత్సాహం అందినప్పుడే ఉన్నత శిఖరాలను చేరుకుంటారన్నారు. ఇందుకు పురుషులు కూడా తమ వంతు బాధ్యతగా మహిళలకు అన్ని రకాలుగా సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినులు రాజశ్రీ, శబనాజ్, మాధురి, శ్రీలక్ష్మి, రజిత, కీర్తన, మేఘన, అనూష, నవ్య, మేఘన, జోయా పాల్గొన్నారు.



నవీపేట్‌లో..



చదువుతోనే సమాజంలో ముందుకు

నవతెలంగాణ-భీంగల్

చదువుతోనే మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళుతున్నారని ఐసిడిఎస్ భీంగల్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రమాదేవి నవతెలంగాణతో మాట్లాడారు. విద్యతోనే సమాజాభివృద్ధి జరుగుతుందని, ఆడపిల్లలను కూడా ఉన్నత చదువులు చదివించాలన్నారు. బాలిక సంరక్షణ కు ప్రతి ఒక్కరు పాటుపడాలని మహిళా దినోత్సవం సందర్భంగా తెలియజేశారు.

అంగన్వాడీ కేంద్రాల్లో న్యూట్రిషన్ గార్డెన్లు

- ఐసీడీఎస్ సూపర్వైజర్ మమత



నవతెలంగాణ-వర్ని

ప్రభుత్వ ఆదేశాల మేరకు సొంత భవనాలు కలిగిన అంగన్వాడి సెంటర్లలో న్యూట్రిషన్ గార్డెన్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఐసీడీఎస్ సూపర్వైజర్ మమత అన్నారు. అంగన్వాడీ ప్రాంగణంలో ఖాళీ ప్రదేశంలో ఆకుకూరలు, ఇతర చిరుధాన్య పంటలను సాగు చేస్తున్నట్టు వివరించారు. ప్రస్తుతం అన్ని చోట్ల బాలింతలకు, గర్భిణులకు, చిన్నపిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నామని వివరించారు.

ఘనంగా మహిళా దినోత్సవం



జుక్కల్: మహిళలను సన్మానించిన పలువురు

అమ్మగా ప్రతిరూపమై
అలిగా, చెల్లిగా అనుబంధమై..
ఆకాశమంత ఎదిగినా
మమకారం మరువని మహోన్నత మగువ..
నీ తోడు ఎలా మరువగలం
సృష్టికి ప్రతి సృష్టివై.. కలియుగ బ్రహ్మ అయినావు

\- లింబారి లక్ష్మణ్, జర్నలిస్ట్ బోధన్..

- మహిళలకు సన్మానం

నవతెలంగాణ-విలేకరుల బృందం

జుక్కల్ : మండలంలోని మహరాష్ట్ర సరిహద్దు గ్రామమైన బిజ్జల్‌వాడి గ్రామంలోని ప్రభుత్వ ఎంపిపిఎస్ పాఠశాల ఉపాధ్యాయురాలిని ఇంగుభారతి విఠల్‌ను మాజీ సర్పంచ్ గౌళే యాదవ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదు, గ్రామస్తులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

జీపీలో మహిళలకు సన్మానం

మండలంలోని పెద్దఎడ్గి గ్రామ పంచాయతీలో మహిళా ఉద్యోగస్తులను గ్రామ పంచాయతీ కార్యాలయంలో జీపీ కార్యదర్శి రమేష్‌చారి ఘనంగా సన్మానించారు.

అన్ని రంగాల్లో రాణించాలి..

మహిళలు అన్నిరంగాలలో పురుషులతో సమానంగా ఎదగాలని హంగర్గ గ్రామ పంచాయతీ కార్యదర్శి అశోక్‌గౌడ్ అన్నారు. జీపీ భవనంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల మహిళ టీచర్లకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు జయశ్రీ, కాలీందబాయితో పాటు ఆయాలను జీపీ కార్యదర్శి ఆశోక్‌గౌడ్ శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

ద్వాక్రా మహిళలకు రంగోలి పోటీలు..

నాగిరెడ్డిపేట్ : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో గల ఐకెపి కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు రంగోలి, మెహేంది పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏపీఎం జగదీష్, మండల సమాఖ్య పాలకవర్గ సభ్యులు లక్ష్మీ, సీసీలు నారాయణ, శ్రీనివాసరెడ్డి, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

బోధన్ : మండలంలోని బెల్లాల్ గ్రామ పంచాయతీలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థాయి మహిళ ఉద్యోగులకు శాలువాల తో సన్మానించి వారికి చీరెను పంపిణీ చేశారు. గ్రామ మహిళా అధ్యక్షురాలు లలిత, ఆరోగ్య కార్యకర్త ఎస్ సంధ్యారాణి, ప్రైమరీ స్కూల్ టీచర్ అనసూయ, ఆరిఫా, దివ్య, దేవమణి, బిల్లాల్ గ్రామ పంచాయతీ సెక్రటరీ పాల్గొన్నారు.

మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిషత్ కార్యాలయం ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజదాస్, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో పర్బన్న, ఎంపీవో శ్రీనివాస్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో మహిళలకు ముగ్గు పోటీలు..

ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా బోధన్ మున్సిపల్ కార్యాలయంలో మహిళలకు ముగ్గుల పోటీలు, మెహెంది పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో మహిళలు ఓటర్లను చైతన్యం కలిగించేలా రంగవల్లులు వేశారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, బోధన్ పట్టణ మహిళా సంఘాల సభ్యులు, మెప్మా కోఆర్డినేటర్ శ్రీనివాస్, మెప్మా సీఓలు, ఆర్పీలు పాల్గొన్నారు.

సదాశివనగర్ : గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా కళాశాల ప్రిన్సిపాల్ వి.రాధిక మాట్లాడారు. కళాశాల కల్చరల్ కోఆర్డినేటర్ ఆర్.ఉదయిని, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వి.రేణుక, అకాడమిక్ కోఆర్డినేటర్ కె.వనజ పాల్గొన్నారు.

గురుకుల టీచర్‌కు సన్మానం..

పెద్దకొడప్‌గల్ : మండలంలోని కాటేపల్లి గ్రామానికి చెందిన అబ్బన్ బోయిన విజయ్ కుమార్ గురుకుల టీచర్‌గా ప్రభుత్వ ఉద్యోగం సాధించినందుకు ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించి అందరికీ స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మల్లప్ప పటేల్ మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు మొహిద్దిన్ పటేల్, సింగిల్ విండో డైరెక్టర్లు గంగాగౌడ్, పెంటన్న, నాయకులు మొగులాగౌడ్, హన్మాండ్లు, సాయిలు, షేక్ చాంద్ పాషా, ఇస్మాయిల్ పటేల్, చోటు పటేల్, హాజి, శంకర్, బందిగి పర్వయ్య, నీరుడి అశోక్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : సమాజంలో నేడు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, మహిళల విషయంలో చిన్న చూపు చూడరాదని జెడ్పిటిసి మేక విజయ సంతోష్ స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీఓ గౌసుద్దీన్, మండల విద్యాశాఖ అధికారి గణేష్‌రావు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఆరోగ్య విస్తీర్ణ అధికారి రవీందర్, అంగన్వాడీ కార్యకర్తలు సుజాత, సురేఖ, పద్మ, రజిత, సుజాత, రాజ్యలక్ష్మి, రాధిక, రాజశ్రీ, అరుణ, విజయలక్ష్మి, పూజ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి : మహిళలకు అన్ని రంగాల్లో హక్కులు కల్పించాలని రాజకీయ, ఆర్థిక రంగాలలో మహిళపై వేధింపులను అరికట్టాలని బహుజన లెఫ్ట్ మహిళా సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ సబ్బాని లత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో బిఎల్‌టీయూ కార్యాలయంలో నిర్వహించిన మహిళ సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు.

ఎక్కడైతే మహిళలు పూజింపబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని సౌత్ క్యాంపస్ సోషల్ వర్క్ ప్రొఫెసర్ డాక్టర్ రాజేశ్వరి అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా కేంద్రంలో గల మంజీరా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సోషల్ వర్క్ ప్రొఫెసర్ డాక్టర్ రాజేశ్వరి మాట్లాడుతూ స్త్రీల గొప్పతనాన్ని వివరించారు. సమాజంలో స్త్రీ తల్లి, భార్య, సోదరి పాత్రల గొప్పతనాన్ని ఆమె తెలియజేశారు. మహిళలు అన్ని రంగాలలో ముందుంటూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కె.గురువేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళల గొప్పతనాన్ని వివరిస్తూ ఈ సందర్భంగా మహిళా అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, విజయకుమార్, డైరెక్టర్ సురేష్‌గౌడ్, మహిళా అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు పోటీలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం నిజామాబాద్ జిల్లా సమీకృత సముదాయాల కార్యాలయంలో మహిళా ఉద్యోగులు అందరూ ఆట, పాటలతో మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.